

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:121 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 22-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

విమర్శలే నీ పదును..
కష్టాలే నీ గెలుపు మెట్లు!

ఒకసారి గొడ్డలిని ఎవరో అడిగారట..
"నిన్ను పదును పెట్టడానికి
పదేపదే కఠినమైన రాయిపై
రుద్దుతారు కదా, నీకు నొప్పి కలగదా?"
అని.అందుకు ఆ గొడ్డలి నవ్వుతూ ఇలా
బదులిచ్చింది.. "నన్ను రుద్దే ప్రతి రాపిడి
నాలోని మొద్దుబారిన తనాన్ని పోగొట్టి,
నా సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తుంది.
"మన జీవితం కూడా అచ్చం ఆ గొడ్డలి
లాంటిదే.. సమాజంలో మనల్ని చుట్టుముట్టే
కష్టాలు, అవమానాలే మనల్ని పదును పెట్టే
రాళ్లు. నువ్వు ఎదుగుతున్నావంటే నిన్ను
కిందకు లాగడానికి, నిన్ను విమర్శించడానికి
వందల గొంతులు సిద్ధంగా ఉంటాయి.
కానీ, ఆ విమర్శలను చూసి భయపడితే
నీ ప్రయాణం అక్కడే ఆగిపోతుంది..
వాటిని ఆయుధాలుగా మార్చుకుంటేనే
విజయం వరిస్తుంది.ఎదుటివారి విమర్శలలో
ఉన్న నిజాన్ని గ్రహించి, నీ లోపాలను
సరిదిద్దుకుంటూ ముందుకు సాగడమే
అసలైన విజ్ఞత.
ఉలి దెబ్బలకు ఓర్చుకున్న రాయి మాత్రమే
దేవుడి విగ్రహంగా మారి అందరి చేత
పూజలు అందుకుంటుంది.
నిన్ను రుద్దే ప్రతి కష్టాన్ని చిరునవ్వుతో
స్వీకరించు.. అదే రేపు నిన్ను శిఖరాగ్రాన
నిలబెట్టే అసలైన శక్తిగా మారుతుంది!

యాకన్న గాడి పెల్లి
జనగామ జిల్లా బ్యూరో చీఫ్

ఒవైసీపై రేవంత్ గురి.!



- అధికారంలోకి వచ్చాక తొలిసారి బహిరంగ విమర్శలు
- రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్
- యూపీలో కొత్త కూటమి తెరపైకి రావడమే కారణమా.?
- మైనారిటీ ఓట్ల చీలికపై కాంగ్రెస్ లో ఆందోళనా.?
- హైకమాండ్ కు స్పష్టమైన సంకేతాలు పంపించారా.?
- జీహెచ్ ఎంసీ ఎన్నికల వేళ మారనున్న రాజకీయ సమీకరణాలు
- కాంగ్రెస్,ఎంఐఎం దోస్తీకి పరీక్షా సమయం



ప్రజా వాయిస్,హైదరాబాద్:తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం.. ఇప్పటివరకు ఎంఐఎంతో సఖ్యతగా వ్యవహరిస్తూ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కసారిగా ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు ఒవైసీ కూడా హిందూ, ముస్లిం ఓట్ల రాజకీయాలే చేస్తున్నారని వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎంఐఎంపై అమిత్‌షాకు నిజంగానే వ్యతిరేకత ఉంటే హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఒవైసీని ఓడించాలని సవాల్ విసరడం ఈ విమర్శలకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన 'సదరన్ రైజింగ్ సమ్మిట్-2026'లో సీఎం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. ఇన్నాళ్లూ కొనసాగిన సాన్నిహిత్యం వెనుకబడిందా, లేక జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రేవంత్ కొత్త రాజకీయ వ్యూహానికి తెరతీశారా, అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

యూపీ పరిణామాలే అసలు మలుపా.?

రేవంత్ వ్యాఖ్యల వెనుక ఉత్తరప్రదేశ్ రాజకీయ పరిణామాలు ఉన్నాయన్న విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి. యూపీలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్‌తో కలిసి 'సామాజిక్ పరివర్తన్ మోర్చా' (ఎస్‌పీఎం) పేరుతో కొత్త కూటమిని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ పరిణామం కాంగ్రెస్ రాజకీయ వ్యూహాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా మైనారిటీ ఓట్లలో చీలిక ఏర్పడితే రాజకీయంగా బీజేపీకి ప్రయోజనం కలగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒవైసీ రాజకీయాలపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు యూపీ పరిణామాలకు ప్రతిస్పందనగా వచ్చాయా? అన్నది ఆసక్తికరంగా మారింది.

హైకమాండ్‌కు హింట్ ఇచ్చారా.?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎంఐఎంతో సఖ్యత కొనసాగుతోంది. అసెంబ్లీలో ఏడుగురు సభ్యులున్న ఎంఐఎం పలు సందర్భాల్లో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచింది. 2024లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూకే పర్యటన సందర్భంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కూడా ఆయనతో కలిసి వెళ్లడం అప్పట్లో రాజకీయంగా చర్చకు దారి తీసింది. దీంతో రెండు పార్టీల మధ్య సాన్నిహిత్యంపై అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు ఒవైసీపై సీఎం చేసిన వ్యాఖ్యలు ఆ సంబంధాలపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్

మిగతా 2లో

కొత్త సినిమాలకు పైరసీ సెగ.!

- థియేటర్లలోనే రహస్య చిత్రీకరణ
- ఆన్‌లైన్‌లోకి సినిమాలు
- రూ.20 వేల కోసం పైరసీ ముఠాతో విద్యార్థుల ఒప్పందం
- క్రిప్టో కరెన్సీలో చెల్లింపులు
- ఇద్దరు యువకుల అరెస్ట్
- కీలక సూత్రధారుల కోసం తెలంగాణ సైబర్ పోలీసుల దర్యాప్తు

2 లో



తెలంగాణ నీళ్లపై ఏపీ పెత్తనం
బీజేపీ నేతల మౌనవ్రతం.!



- చంద్రబాబు, మోదీ కనుసన్నల్లో తెలంగాణ బీజేపీ
- నాగార్జునసాగర్ జల వివాదంపై కనీస స్పందన కరువు
- కృష్ణా, గోదావరి నీటి వాటాలపై ప్రశ్నించని వైనం
- రాష్ట్రానికి 8 మంది ఎంపీలు ఉన్నా.. కేంద్రంపై ఒత్తిడి ఏదీ
- సెటిలర్ల ఓట్ల కోసం ఏపీ నేతలతో దోస్తీనా.?
- రాష్ట్ర ప్రయోజనాలపై నిర్లక్ష్యమా.?

ప్రజా వాయిస్,హైదరాబాద్: తెలంగాణ నీటి హక్కులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో వివాదాలు కొనసాగుతుంటే రాష్ట్ర బీజేపీ నాయకులు మాత్రం మౌనముద్ర వీడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగార్జునసాగర్ పరిధిలో నీటి వినియోగం మొదలుకొని కృష్ణా, గోదావరి జలాల వాటాల వరకు ఏపీ ప్రభుత్వ తీరుపై గట్టిగా స్పందించాల్సిన నేతలు.. కనీసం ప్రశ్నించేందుకు కూడా ముందుకు రావడం లేదన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ ప్రయోజనాల కంటే ఢిల్లీ పెద్దల ఆదేశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా చంద్రబాబు, మోదీ రాజకీయ సమీకరణాల మధ్య రాష్ట్ర ప్రయోజనాలు బలవుతున్నాయా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మోదీ సర్కారుపైనా మౌనమే

ఆంధ్రప్రదేశ్ జలదోపిడీకి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకరిస్తోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ఈ ఆరోపణలపై తెలంగాణ బీజేపీ నాయకత్వం స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలో తమ పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణ నీటి హక్కుల విషయంలో కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో మాట్లాడే అవకాశం ఉన్నా ఆ దిశగా చొరవ చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

8 మంది ఎంపీలు.. గళమెత్తేదెప్పుడు.?

తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర జలశక్తి శాఖతో మాట్లాడటం, పార్లమెంటులో జల వివాదాలను ప్రస్తావించడం, రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాల కోసం ఒత్తిడి తీసుకురావడం వంటి అవకాశాలు ఉన్నా.. ఆ దిశగా వారి కార్యాచరణ ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ తెలంగాణ నీటి వనరుల పరిరక్షణపై మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

చంద్రబాబు, పవన్‌తో దోస్తీ.. తెలంగాణపై నిర్లక్ష్యమా.?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో తెలంగాణ బీజేపీ నేతలు సమావేశాలు నిర్వహించడంపై రాజకీయ విమర్శలు వినిపిస్తున్నాయి. సెటిలర్ల ఓట్లను దృష్టిలో పెట్టుకునే ఏపీ నేతలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ భేటీలకు చూపుతున్న చొరవ తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణలోనూ

మిగతా 2లో

ఆపరేషన్ సిందూర్ వేళ పాక్‌కు చైనా సాయం.!

- భారత్ ఎదుగుదలను అడ్డుకునే వ్యూహం
- సరిహద్దుల్లో ఒత్తిడి.. పారిశ్రామిక ఆంక్షలతో కట్టడి యత్నాలు
- పాక్‌కు సైనిక సహకారం అందించినట్లు అమెరికా కాంగ్రెస్ ప్యానెల్ నివేదిక వెల్లడి
- చైనా దూకుడును ఎదుర్కొనేందుకు భారత్,అమెరికా సమన్వయానికి పిలుపు

2 లో



మంత్రి పదవి రేసులో రాజగోపాల్‌రెడ్డి ఉన్నట్టా.. లేనట్టా.?

- సీఎం రేవంత్‌పై విమర్శలతో మారిన రాజకీయ సమీకరణాలు
- రెండుసార్లు చేజారిన అవకాశం.. ఈసారైనా దక్కేనా?
- కేబినెట్‌లో చోటు ఇవ్వొద్దంటూ హైకమాండ్‌కు ఫిర్యాదులు
- సొంత పార్టీలోనే వ్యతిరేక స్వరాలు.. మంత్రి పదవిపై నీలినీడలు
- డిసెంబరులో కేబినెట్ విస్తరణ.. అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠ



ఎదురుచూస్తున్న తరుణంలో సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతుండటం చర్చనీయాంశంగా మారింది.

ప్రజా వాయిస్,హైదరాబాద్: మంత్రి పదవి రేసులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారా.? లేరా? కాంగ్రెస్ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే చర్చ నడుస్తోంది. మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు గతంలో మంత్రి పదవి ఇస్తామన్న హామీ ఉందనే ప్రచారం సాగింది. రెండు పర్యాయాలు అవకాశం చేజారిన నేపథ్యంలో ఈసారి కేబినెట్‌లో చోటు దక్కుతుందనే ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విధానాలపై ఆయన చేస్తున్న వరుస విమర్శలు కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీశాయి. మంత్రి పదవి కోసం

హామీ ఒకటి.. ఎదురైన అడ్డంకులు రెండు

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామనే హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు జిల్లాలు, సామాజిక సమీకరణాల కారణంగా అవకాశం దక్కలేదు. ఆ తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలోనూ ఆయన పేరు పరిశీలనకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే మంత్రిగా

మిగతా 2లో

తెలుగు రాష్ట్రాలకు వర్ష గండం.. మూడు రోజుల పాటు అప్రమత్తత

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు అవకాశం
- కోస్తాంధ్ర, యానాంలో వర్ష ప్రభావం అధికం
- రాయలసీమలోనూ మోస్తరు వానలు
- తెలంగాణలో ఆదివారం పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం



కేసీఆర్ భూముల లెక్కలన్నీ అసెంబ్లీలో బయటపెడతాం.!

- ఫామ్‌హౌస్ భూముల సర్వే దాదాపు పూర్తి
- త్వరలోనే పూర్తి వివరాలు ప్రజల ముందుకు
- కాళేశ్వరం మూడు బ్యారేజీల్లో సీకెంట్ పైల్స్ వాడటంతోనే కుంగుబాటు
- రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా
- భూ భారతి సాంకేతిక సమస్యలకు పరిష్కారం
- కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది
- బీజేపీకి రాష్ట్రంలో భవిష్యత్తు లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలు



ప్రజా వాయిస్,హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భూముల వ్యవహారంపై అసెంబ్లీ వేదికగా పూర్తి లెక్కలు బయటపెడతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూముల సర్వే ప్రక్రియ దాదాపు పూర్తయిందని, త్వరలోనే పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచుతామని వెల్లడించారు. సర్వే ప్రారంభమైన వెంటనే మాజీ మంత్రి హరీశ్‌రావు మామ తన భూమి విషయంలో కోర్టును ఆశ్రయించి ముందస్తు స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి

మిగతా 2లో

కొత్త సినిమాలకు పైరసీ సెగ.!

ప్రజా వాయిస్, హైదరాబాద్: కొత్త సినిమా విడుదలైందంటే చాలు.. పైరసీ ముఠాలకు పండగే ప్రేక్షకుల ముసుగులో థియేటర్లలోకి వెళ్లి, మొబైల్ ఫోన్లతో సినిమాలను రహస్యంగా చిత్రీకరించి ఆన్‌లైన్‌లో లీక్ చేస్తున్న అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వెండితెరపై విడుదలైన కొత్త సినిమాలను పైరసీ నెట్‌వర్క్‌కు చేరవేస్తూ డబ్బులు సంపాదిస్తున్న ఇద్దరు విద్యార్థుల గుట్టును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన ఇద్దరు 19 ఏళ్ల యువకులను అరెస్ట్ చేశారు.

థియేటర్లలో కెమెరా కన్ను

కర్నూలుకు చెందిన షేక్ రిజ్వాన్ (19), రాంపోగు అజయ్ (19) స్థానిక ఎస్‌వీసీ సినిమాస్ థియేటర్‌ను పైరసీ చిత్రీకరణకు వేదికగా చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కొత్త సినిమాలు విడుదలైన వెంటనే థియేటర్లలోకి వెళ్లి మొబైల్ ఫోన్లతో ఎవరికీ అనుమానం రాకుండా చిత్రీకరించేవారు. అనంతరం ఆ వీడియోలను పైరసీ ముఠాలకు చేరవేస్తూ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు.

సినిమాకో రేటు..
రూ.20 వేల వేటు

పైరసీ దందాలో ఒక్కో సినిమాకు రూ.20 వేల చొప్పున కమిషన్ అందుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. సాధారణ బ్యాంకు లావాదేవీలు చేస్తే పోలీసులకు చిక్కే ప్రమాదం ఉండటంతో క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బులు స్వీకరిస్తున్నట్లు విచారణలో తేలింది. సినిమాలను చిత్రీకరించడం నుంచి వాటిని పైరసీ నెట్‌వర్క్‌కు చేరవేయడం వరకు పక్కా ప్రణాళికతో వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు.

విద్యార్థుల వెనుక అసలు ముఠా ఎవరు.?

ఇద్దరు యువకుల అరెస్టుతో పైరసీ వ్యవహారం వెలుగులోకి వచ్చినా.. దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులెవరు. కొత్త సినిమాలను ఆన్‌లైన్‌లో లీక్ చేస్తున్న నెట్‌వర్క్ ఎక్కడి నుంచి పనిచేస్తోంది. పైరసీ ద్వారా వచ్చే సొమ్ము ఎవరికి చేరుతోంది? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ అక్రమ నెట్‌వర్క్ మూలాలను గుర్తించి, మిగతా నిందితులను పట్టుకునేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు విచారణను ముమ్మరం చేశారు.

హెచ్చరికల తర్వాతే చర్యలు.!

- **కొండా సురేఖ విషయంలోనూ వెంటనే స్పందించలేదు**
- **రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏఐసీసీ నజర్**
- **పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది**
- **క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుంది**
- **తెలంగాణ నీటి వాటాలో ఒక్క బొట్టునూ వదులుకోం: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**



ప్రజా వాయిస్, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వ్యాఖ్యల రాజకీయాలు మరోసారి తెరపైకి వచ్చాయి. పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశం కావడంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే నేతల విషయంలో ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని స్పష్టం చేశారు. అయితే ప్రతి వ్యాఖ్యకూ తక్షణమే చర్యలు ఉండవని, పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి నెలకొంది.

ముందు హెచ్చరికలు..ఆ తర్వాతే చర్యలు

గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేష్‌కుమార్ గౌడ్.. గతంలో మంత్రి కొండా సురేఖ విషయంలోనూ తొలిసారే చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. ముందుగా పలుమార్లు హెచ్చరించామని, అయినప్పటికీ వైఖరిలో మార్పు రాకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారి వ్యవహారాన్ని ఏఐసీసీ పరిశీలిస్తోందని, క్రమశిక్షణ చర్యలపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. పార్టీలో క్రమశిక్షణ విషయంలో అందరూ సమానమేనని, ఏ నిర్ణయానికైనా సరైన సమయం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో ఎమ్మెల్యేలపై తక్షణ చర్యల కంటే ముందుగా హెచ్చరికలు, పరిశీలనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సంకేతాలిచ్చారు.

జలహక్కులపై రాజీ లేదు

తెలంగాణ నీటి వాటాల అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు ఘాటుగా స్పందించారు. రాష్ట్రానికి దక్కాల్సిన నీటి వాటాలో ఒక్క బొట్టును కూడా వదులుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ జలహక్కుల విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహం చేయాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు చేయడంలో కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ ప్రయోజనాలను కోరుకోవడం లేదంటూ విమర్శలు చేశారు. ఒకవైపు పార్టీ అంతర్గత క్రమశిక్షణపై స్పందిస్తూనే.. మరోవైపు రాష్ట్ర జలహక్కుల విషయంలో ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

సినిమా స్టైల్‌లో గోల్డ్ స్మగ్లింగ్..
అధికారులకే షాక్
ఇచ్చిన స్మగ్లర్ల మాస్టర్ ప్లాన్

- **కారు టెయిల్ ల్యాంప్ వెనుక రహస్య అర**
- **రూ.3.83 కోట్ల విదేశీ బంగారం స్వాధీనం**



ప్రజా వాయిస్,హైదరాబాద్.బంగారం అక్రమ రవాణా కోసం స్మగ్లర్లు సినిమా స్థాయిలో మాస్టర్ ప్లాన్లు రచిస్తున్నారు. అధికారుల కళ్లుగప్పేందుకు ఏకంగా కారులోనే రహస్య అరను ఏర్పాటు చేసి విదేశీ బంగారాన్ని తరలిస్తున్న ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. కారు టెయిల్ ల్యాంప్ వెనుక ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య క్యావిటీలో బంగారాన్ని దాచి తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (DRI) అధికారులు గుర్తించారు. తనిఖీల్లో సుమారు రూ.3.83 కోట్ల విలువైన విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సినిమాల్లో మాత్రమే కనిపించే తరహాలో కారులో రహస్య అరను ఏర్పాటు చేసి బంగారం తరలించే ప్రయత్నం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు? బంగారం ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

మంత్రి పదవి రేసులో
రాజగోపాల్‌రెడ్డి ఉన్నట్టా.. లేనట్టా.?

మొదటి పేజీ తరువాయి

ఉండటంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో మరోసారి ఆయనకు నిరాశే ఎదురైంది.

విమర్శలతో మారిన రాజకీయ లెక్కలు

ఇటీవల నియోజకవర్గానికి నిధుల కేటాయింపు, ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి.. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ తీరును తప్పుపడుతూ ఘాటు వ్యాఖ్యలు చేయడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రభుత్వంలో భాగస్వామ్యం కావాలని ఆశిస్తున్న నేతే ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఏమిటన్న ప్రశ్నలు సొంత పార్టీలో వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు ఆయన మంత్రి పదవి అవకాశాలపై ప్రభావం చూపుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధిష్ఠానం వద్దకు ఫిర్యాదులు

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై అసంతృప్తితో ఉన్న కొందరు కాంగ్రెస్ నేతలు ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవద్దంటూ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని మరికొందరు కోరినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలన్న అంశంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి నెలకొంది.

డిసెంబరు విస్తరణలో తేలనున్న లెక్కలు

కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగో ఏడాదిలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను భర్తీ చేసే అంశం తెరపైకి వచ్చింది. డిసెంబరులో కేబినెట్ విస్తరణ జరిగే అవకాశాలున్నాయన్న ప్రచారం నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ జాబితాలో రాజగోపాల్‌రెడ్డి పేరు ఉంటుందా, గతంలో ఇచ్చిన హామీని అధిష్ఠానం నిలబెట్టుకుంటుందా, లేక తాజా పరిణామాల నేపథ్యంలో ఆయనకు అవకాశం దక్కకుండా పోతుందా, అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తెలుగు రాష్ట్రాలకు వర్ష గండం..
మూడు రోజుల పాటు అప్రమత్తత

ప్రజా వాయిస్.హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుంది. రానున్న మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర ఒడిశా నుంచి ఉత్తర ఛత్తీస్‌గఢ్ వైపు అల్పపీడనం కదులుతుండటంతో పాటు దక్షిణ, నైరుతి గాలుల ప్రభావంతో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది.ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడవచ్చని అంచనా వేసింది. మరోవైపు తెలంగాణలో ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. వర్షం పడుతున్న సమయంలో చెరువులు, వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదు. రైతులు వ్యవసాయ పనుల సమయంలో వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనదారులు వర్షాల సమయంలో వేగం తగ్గించి ప్రయాణించాలని సూచించింది.వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో ప్రజలు వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



ఒవైసీపై రేవంత్ గురి.!

మొదటి పేజీ తరువాయి

అధిష్ఠానానికి పార్టీ రాజకీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమనే సంకేతాలు పంపించేందుకే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే ఈ వ్యాఖ్యల వెనుక అదే కారణమని చెప్పడానికి ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు లేవు.

జీహెచ్ఎంసీ ఎన్నికలే
అసలు పరీక్ష

తెలంగాణలో రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు కాంగ్రెస్, ఎంఐఎం సంబంధాల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశంగా మారనున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ వచ్చిన ఎంఐఎంతో కాంగ్రెస్ ఎన్నికల సమయంలోనూ అదే ధోరణిని కొనసాగిస్తుందా, లేక హైదరాబాద్‌లో తన రాజకీయ బలాన్ని పెంచుకునేందుకు ఒంటరి పోరుకు సిద్ధమవుతుందా, అన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో బీఆర్ఎస్‌తో సన్నిహితంగా ఉన్న ఎంఐఎం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంతో అంశాలవారీగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో తాజా విమర్శలు రెండు పార్టీల మధ్య సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది చూడాలి.

మాటల యుద్ధమా.. వ్యూహాత్మక మార్పా.?

ఒవైసీపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఒక రాజకీయ వేదికపై వ్యక్తమైన విమర్శలుగానే మిగిలిపోతాయా లేక కాంగ్రెస్, ఎంఐఎం మధ్య ఇప్పటివరకు కొనసాగిన రాజకీయ సాన్నిహిత్యంలో మార్పునకు నాంది పలుకుతాయా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్న. యూపీ ఎన్నికల సమీకరణాలు, కాంగ్రెస్ జాతీయ ప్రయోజనాలు, హైదరాబాద్ రాజకీయాలు.. ఈ మూడు అంశాల మధ్య రేవంత్ వ్యాఖ్యలను రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి రెండు పార్టీల వైఖరి ఎలా ఉంటుందన్నది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారనుంది. ప్రస్తుతానికి మాత్రం ఒవైసీపై సీఎం చేసిన తాజా విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి.

కేసీఆర్ భూముల లెక్కలన్నీ
అసెంబ్లీలో బయటపెడతాం.!

మొదటి పేజీ తరువాయి

పలు అంశాలపై మాట్లాడారు.

కాళేశ్వరంలో సీకెంట్ పైల్స్ ఎందుకు.?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిందని పొంగులేటి ఆరోపించారు. కేంద్రానికి సమర్పించిన డీపీఆర్‌లో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తామని పేర్కొని, అందుకు భిన్నంగా ఎలాంటి అనుమతులు లేకుండా మూడు బ్యారేజీల్లోనూ సీకెంట్ పైల్స్ వినియోగించారని విమర్శించారు. సీకెంట్ పైల్స్ వాడటం వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, డయాఫ్రమ్ వాల్ నిర్మించి ఉంటేనే ప్రాజెక్టులు నిలబడేవని వ్యాఖ్యానించారు. డీపీఆర్‌లో పేర్కొన్న విధానాన్ని పక్కనపెట్టి సీకెంట్ పైల్స్ ఎందుకు ఉపయోగించారో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

భూ భారతి సమస్యలకు పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు దాదాపు పూర్తిగా పరిష్కారమయ్యాయని మంత్రి తెలిపారు. రైతులు, భూ యజమానులకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ సేవలను మరింత మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు.

యుద్ధం ఎప్పుడు చేయాలో అప్పుడే చేస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో తాను ఎంతో సౌకర్యంగా ఉన్నానని, వచ్చే ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో తమ ఐదుగురికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ఎన్నికల వ్యూహాలు, ప్రతిపక్షాలను ఎదుర్కొనే విధానాలపై తమకు అనుభవం ఉందని పేర్కొన్నారు. రాజకీయ యుద్ధం ఎప్పుడు చేయాలో అప్పుడే చేస్తామని, ఆ పోరులో గెలిచి తీరుతామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి బాగాలేదని, ప్రస్తుతం ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలను కాపాడుకుంటేనే గొప్పంటూ ఎద్దేవా చేశారు.

ఆపరేషన్ సిందూర్ వేళ
పాక్‌కు చైనా సాయం.!

ప్రజా వాయిస్,డెస్క్: భారత్ సాధిస్తున్న వేగవంతమైన వృద్ధి చైనాకు వ్యూహాత్మక సవాలుగా మారుతోందా, దేశ సైనిక, ఆర్థిక సామర్థ్యాలు పెరుగుతుండటాన్ని డ్రాగన్ తన ప్రయోజనాలకు విఘాతంగా భావిస్తోందా, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక సహకారం అందించిందని అమెరికా కాంగ్రెస్ ప్యానెల్ నివేదిక పేర్కొనడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

పాక్‌కు అండగా డ్రాగన్

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు చైనా సైనిక సహకారం అందించిందని నివేదిక వెల్లడించింది. అమెరికా కూటమిలో భాగం కాకపోయినా.. చైనా సైనిక శక్తిని ప్రభావితం చేయగల సామర్థ్యం ఉన్న దేశాల్లో భారత్ ఒకటని విశ్లేషించింది. భారత్ ఎదుగుదలపై చైనాకు ఉన్న వ్యూహాత్మక ఆందోళనలే ఈ వైఖరికి కారణమని అభిప్రాయపడింది.

సరిహద్దుల్లో ఒత్తిడి.. ఆర్థిక ఆంక్షలు

భారత్‌ను కట్టడి చేసేందుకు చైనా పలు మార్గాలను అనుసరిస్తోందని నివేదిక పేర్కొంది. సరిహద్దుల్లో నిరంతర ఒత్తిడి పెంచడంతోపాటు పారిశ్రామిక ఆంక్షల ద్వారా భారత పురోగతికి ఆటంకాలు కలిగించే ప్రయత్నాలు చేస్తోందని తెలిపింది. సైనిక, ఆర్థిక రంగాల్లో భారత్ సామర్థ్యం పెరగడం చైనా ప్రాంతీయ వ్యూహాలకు సవాలుగా మారుతోందని విశ్లేషించింది.

భారత్–అమెరికా సహకారమే కీలకం

చైనా దూకుడు వ్యూహాలను ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా కలిసి పని చేయాలని అమెరికా కాంగ్రెస్ ప్యానెల్ సూచించింది. పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చింది. ఆసియా ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్–చైనా సంబంధాలు, పాక్–చైనా సైనిక బంధంపై మరోసారి చర్చకు దారితీసింది.

ప్రేమ పేరుతో వేధింపులు..
యువతి బలవన్మరణం

- **పెళ్లికి నిరాకరించిన యువకుడు**
- **అతడి కుటుంబ సభ్యులపైనా కేసు**
- **ప్రధాన నిందితుడితో పాటు తల్లిదండ్రులు, సోదరుడి అరెస్టు.. నలుగురికి రిమాండ్**



ప్రజా వాయిస్,బూర్గంపాడు: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. చివరకు వివాహానికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బూర్గంపాడు మండలంలో విషాదం నింపింది. ఈ ఉకేసులో ప్రధాన నిందితుడితో పాటు అతడికి సహకరించారనే ఆరోపణలపై అతని కుటుంబ సభ్యులు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం చెరువు సింగారం గ్రామానికి చెందిన చర్ల కవిత (20) అదే గ్రామానికి చెందిన సున్నం చరణ్‌ను ప్రేమించింది. అయితే చరణ్ వివాహానికి నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కవిత క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది.మృతురాలి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రసాద్ దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు సున్నం చరణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు లక్ష్మయ్య, జ్ఞానమణి, సోదరుడు అరుణ్‌లను శనివారం అరెస్టు చేశారు. అనంతరం నలుగురినీ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ నీళ్లపై ఏపీ పెత్తనం
బీజేపీ నేతల మౌనవ్రతం.!

మొదటి పేజీ తరువాయి

ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఉమ్మడి ఆంధ్ర రోజులు గుర్తుకొస్తున్నాయా.?

రాష్ట్ర విభజన జరిగి ఏళ్లు గడిచినా కృష్ణా, గోదావరి జలాల పంపకాలు, ప్రాజెక్టుల నిర్వహణపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణకు రావాల్సిన నీటి వాటా విషయంలో ఏపీ ప్రభుత్వ తీరును ప్రశ్నించాల్సిన రాష్ట్ర బీజేపీ నేతలు మౌనంగా ఉండటం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి పరిస్థితులను గుర్తు చేస్తోందని విమర్శకులు అంటున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తెలంగాణ ప్రయోజనాల విషయంలో అదే నిర్లక్ష్యం కొనసాగుతోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

తెలంగాణ ప్రజల ప్రశ్నలకు
బీజేపీ సమాధానమిస్తుందా.?

రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, బలమైన నాయకత్వం ఉన్నా నీటి హక్కుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడంలో ముందుండే బీజేపీ నేతలు.. తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తెలంగాణ నీటి వాటాల పరిరక్షణకు కేంద్రంతో మాట్లాడతారా ఏపీ ప్రభుత్వ తీరుపై తమ వైఖరిని స్పష్టం చేస్తారా లేక రాజకీయ సమీకరణాలకే ప్రాధాన్యమిస్తారా అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

అనంతరం ఎక్స్ రోడ్డు వద్ద మెరుపు తనిఖీలు

- **ఇద్దరు యువకులకు వైద్య పరీక్షలు**
- **గంజాయి సేవించినట్లు నిర్ధారణ**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు**
- **గంజాయి సేవిస్తే కఠిన చర్యలు తప్పవు: ఎస్సై బాలు నాయక్**

ప్రజా వాయిస్,పెన్‌పహాడ్: గంజాయి మత్తులో జోగుతున్న వారిపై పోలీసులు నిఘా పెంచారు. మత్తు పదార్థాల వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అనంతారం ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై బాలు నాయక్ తన సిబ్బంది ప్రవీణ్, శంకర్‌లతో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పరుగులు తీశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు.విచారణలో వారు మాచారం గ్రామానికి చెందిన శ్రీకాంత్, పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఒగ్గు శ్రీనాథ్‌గా గుర్తించారు. వీరిని ఆసుపత్రికి తరలించి మూత్ర పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణైంది. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేదల బియ్యంపై డీలర్ కన్ను!

- వేలిముద్రలు వేవేయించుకొని బియ్యం మాయం.. ఇదేం రేషన్ దందా?
- సయ్యద్ అలీపూర్ లో వెలుగులోకి వచ్చిన ఆరోపణలు..
- పేదల ఆకలితో చెలగాటమా?
- అధికారుల నిద్ర ఎప్పుడు వీడుతుంది?



వేలిముద్రలు తీసుకున్న బియ్యం ఎక్కడికి వెళ్లింది?

ప్రజావాయిస్/మోమిన్ పేట్:వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని సయ్యద్ అలీపూర్ గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. లబ్ధిదారుల నుంచి ముందుగానే వేలిముద్రలు తీసుకుంటున్న రేషన్ డీలర్ తీరా బియ్యం అడిగితే వచ్చే నెలలో ఇస్తానంటూ కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వేలిముద్రలు తీసుకున్న తర్వాత బియ్యం ఇవ్వకుండా నెలల తరబడి తిప్పించుకోవడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తిన డానికి బియ్యం లేక పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతుంటే, వారి సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంపిణీ చేయకుండానే పంపిణీ చేసినట్లు నమోదు చేశారా? ఈ వ్యవహారం వెనుక అసలు నిజం ఏమిటి?★అన్న ప్రశ్నలు ఇప్పుడు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.ఇప్పటికైనా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి సయ్యద్ అలీపూర్ రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేయాలి. ఈ-పాస్ యంత్రంలోని వేలిముద్రల వివరాలు, బియ్యం నిల్వలు, పంపిణీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలి. బాధితులకు రావాల్సిన బియ్యాన్ని వెంటనే అందించడంతో పాటు ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూ భారతి కాదు..భూ హారతి.!

- రికార్డుల్లో పేర్లు మార్చి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భూమికే ఎసరు
- వెబ్ సైట్ హ్యాకింగ్ మాటున భారీ భూకుంభకోణం
- సంగారెడ్డి, కొల్లూర్ తో పాటు 13 జిల్లాలకు విస్తరించిన అక్రమాలు
- 12 మంది ముఠా సభ్యుల అరెస్ట్
- రెవెన్యూ అధికారుల పాత్రపైనా సీఐడీ అనుమానాలు



ప్రజా వాయిస్,సంగారెడ్డి:భూములకు భరోసా కల్పించాల్సిన భూ భారతి వెబ్‌సైట్‌నే అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారా.. రికార్డుల్లో అసలు యజమానుల పేర్లు తొలగించి, ఇతరుల పేర్లు చేర్చి విలువైన భూములను కొల్లగొట్టే భారీ కుట్రకు తెర లేపారా. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భూమినే లక్ష్యంగా చేసుకున్న ఘటన వెలుగులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా భూ రికార్డుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. సంగారెడ్డి జిల్లా నుంచి కొల్లూర్ వరకు, మరో 13 జిల్లాలకు విస్తరించినట్లు గుర్తించిన ఈ వ్యవహారం భూ రికార్డుల నిర్వహణలోని లోపాలను ప్రశ్నిస్తోంది.

18 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమి మాయం

సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం సంగుపేట పరిధిలోని సర్వే నంబర్ 329/2లో 4.27 ఎకరాల వ్యవసాయ భూమిని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఈశ్ కుమార్ సుమారు 18 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి భూమి ఆయన ఆధీనంలోనే ఉంది. అయితే ఇటీవల ఆ భూమి రికార్డుల్లో మరో వ్యక్తి పేరు ప్రత్యక్షం కావడంతో అసలు వ్యవహారం బయటపడింది.స్థానికంగా ఓ వ్యక్తి ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడుతూ పక్కనే ఉన్న అసైన్డ్ భూమిని ఆక్రమిస్తున్నాడనే ఆరోపణలతో రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి హద్దులు నిర్ధారించే క్రమంలో పక్కనే ఉన్న 4.27 ఎకరాల భూమి మీర్ మురాద్ అలీ పేరుతో నమోదై ఉన్నట్లు గుర్తించారు. దీంతో అసలు యజమాని ఈశ్ కుమార్ అని స్థానిక రైతులు వెల్లడించడంతో భూ రికార్డుల మార్పిడి వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

ఒక్క భూమి కాదు.. 13 జిల్లాల్లో అదే తంతు.!

తన భూమి రికార్డులు వేరే వ్యక్తి పేరుపైకి ఎలా మారాయంటూ ఈశ్ కుమార్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు, సీఐడీ దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. ఈశ్ కుమార్‌కు చెందిన 4.27 ఎకరాలతో పాటు సంగారెడ్డిలో మరో 28 గుంటలు, కొల్లూరులో నాలుగు ఎకరాలు సహా 13 జిల్లాల్లో ఇదే తరహాలో భూముల రికార్డులు మార్చినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో 12 మంది ముఠా సభ్యులను సీఐడీ అధికారులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.అక్రమంగా ఇతరుల పేర్లపైకి మార్చిన భూములను తిరిగి అసలైన యజమానుల పేర్లపై నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించినట్లు తెలుస్తోంది.

హ్యాకింగ్ మాత్రమేనా.. తెరవెనుక సహకారం ఉందా.?

భూ భారతి వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి రికార్డులు మార్చినట్లు ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇంతటి భారీ స్థాయిలో భూముల యాజమాన్య వివరాలు మారిపోవడం వెనుక సాంకేతిక అక్రమాలే ఉన్నాయా? లేక రెవెన్యూ వ్యవస్థలోని కొందరి సహకారం కూడా ఉందా, అన్న కోణంలోనూ దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. రిటైర్డ్ అధికారులు, ఎన్నారైలు, స్థానికంగా అందుబాటులో లేని భూయజమానుల ఆస్తులను లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

పెద్దల భూమికి పరిష్కారం.. సామాన్యుల సంగతేంటి.?

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఫిర్యాదుతోనే వ్యవహారం వేగంగా కదలడంతో సామాన్య భూయజమానుల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతస్థాయి పరిచయాలు, అధికార యంత్రాంగం దృష్టి పడితేనే భూమికి రక్షణ లభిస్తుందా, గ్రామాల్లో భూములు కలిగి పట్టణాలు, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో నివసిస్తున్న వారి ఆస్తులకు భద్రత ఎవరు కల్పిస్తారు. రికార్డుల్లో పేర్లు మార్చే అవకాశం ఎలా ఏర్పడింది. బాధ్యులైన అధికారుల పాత్ర తేల్చి చర్యలు తీసుకుంటారా, అన్న ప్రశ్నలకు దర్యాప్తు సంస్థలు సమాధానం చెప్పాల్సి ఉంది.భూ భారతి పేరుతో భరోసా కల్పించాల్సిన వ్యవస్థలోనే ఇలాంటి అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు నిజమైతే, అది కేవలం భూకుంభకోణం మాత్రమే కాదు.. భూ రికార్డుల భద్రతపై తీవ్రమైన హెచ్చరిక



వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు.!

- విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- సిబ్బందికి డీఎంహెచ్ ఓ స్పష్టమైన ఆదేశాలు
- పెన్ పహాడ్ పీహెచ్ సీలో ఆకస్మిక తనిఖీ

ప్రజా వాయిస్,పెన్‌పహాడ్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కోటిరత్నం ఆదేశించారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు.

సమయపాలన పాటించాలి

వైద్య సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గర్భిణుల నమోదును 95 శాతానికి పైగా పూర్తి చేయాలని, సాధారణ ప్రసవాలకు పీహెచ్‌సీలో ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. హెచ్‌పీవీ టీకాల కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు.

ప్రజారోగ్య కార్యక్రమాల అమలుపై ఆదేశాలు

వృద్ధుల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, పాలియేటివ్ కేర్ రోగులకు ఇళ్ల వద్దే వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి, చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలల సందర్శనలను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు.

ఆన్ లైన్ నమోదులో అప్రమత్తత

వివిధ ఆన్‌లైన్ పోర్టళ్లలో వైద్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, గణాంకాల్లో తేడాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. టీ-హబ్‌కు పంపే నమూనాల్లో నాణ్యత పాటించాలని, నమూనాలు తిరస్కరణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.తనిఖీలో ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సైదమ్మ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు.. చిమ్మచీకట్లో గ్రామ వీధులు.!

- విషసర్పాల సంచారంతో స్థానికుల్లో భయాందోళన
- చీకట్లో రాకపోకలకు మహిళలు, వృద్ధులు, చిన్నారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, మరమ్మతులు చేసే నాథుడే కరువు



ప్రజా వాయిస్,చర్ల:పగలంతా పనులతో బిజీగా ఉండే గ్రామస్తులకు రాత్రి వేళ చీకటే శాపంగా మారింది. వీధులకు వెలుగునివ్వాల్సిన విద్యుత్ దీపాలు మూగబోవడంతో రోడ్లన్నీ చిమ్మచీకటిని తలపిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పంచాయతీ పరిధిలోని రైస్‌పేట గ్రామంలో వీధి దీపాలు కొంతకాలంగా వెలగక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వీధుల వెంట పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాటి మధ్య విషసర్పాలు సంచరిస్తుండటంతో రాత్రివేళ బయటకు రావాలంటేనే గ్రామస్తులు భయపడుతున్నారు. మరోవైపు కొన్ని విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు చీకట్లో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పర్యవేక్షణ ఏదీ.. పట్టించుకునేదెవరు.?

గ్రామ వీధుల్లో విద్యుత్ దీపాలు పనిచేయకపోతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీపాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని వాపోతున్నారు. ఒకవైపు గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను సర్పంచులు సమర్థంగా నిర్వర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి రైస్‌పేట గ్రామంలోని వెలగని వీధి దీపాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ వీధులకు వెలుగులు నింపి, చీకట్లో పొంచి ఉన్న ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కండ్ల కలకపై అప్రమత్తత అవసరం.!

- కొత్తగూడ, గంగారం మండలాల్లో శుక్ల వ్యాధి వ్యాప్తి
- కళ్లలో ఎర్రదనం, దురద, మంట, నీరు కారడం లక్షణాలు
- వైద్యుల సూచన లేకుండా ఐ డ్రాప్స్ వాడొద్దు
- వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట
- విద్యార్థులకు అవగాహన కల్పించిన డాక్టర్ సాయినాథ్

ప్రజా వాయిస్,కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం మండలాల్లో కండ్ల కలక (శుక్ల) వ్యాధి వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీం ఆధ్వర్యంలో పోలారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయినాథ్ మాట్లాడుతూ.. కళ్లలో ఎర్రదనం, దురద, మంట, నీరు కారడం కండ్ల కలక ప్రధాన లక్షణాలని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

సొంత వైద్యం వద్దు

వైద్యుల సలహా లేకుండా సొంతంగా ఐ డ్రాప్స్ వినియోగించరాదని డాక్టర్ సాయినాథ్ సూచించారు. చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని, కళ్లను చేతులతో రుద్దకూడదని, తువ్వాళ్లు, రుమాళ్లు వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని వివరించారు.కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కలిపారు.. పరిహారంలో కోత పెట్టారు.!

- రాయిగిరి రైతులకు భూసేకరణలో అన్యాయం
- కోట్ల విలువైన భూములకు లక్షల్లో పరిహారం
- పట్టణ హోదా ఇచ్చి..పల్లె ధరలతో సరిపెడుతున్నారంటూ ఆందోళన
- పలుకుబడిగల వారికి ఒక న్యాయం
- సామాన్య రైతులకు మరో న్యాయం.?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలని అన్నదాతల వేడుకోలు



ప్రజా వాయిస్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: అభివృద్ధి పేరుతో రైతుల భూములకు ఎసరు.. పరిహారం దగ్గరకు వచ్చేసరికి అధికారుల కొర్రీలు! ఒకప్పుడు గ్రామ పంచాయతీగా ఉన్న రాయిగిరి నేడు భువనగిరి మున్సిపాలిటీలో విలీనమైంది. పట్టణ హోదా వచ్చిందని సంతోషించాలో.. భూముల పరిహారం విషయంలో గ్రామీణ ప్రాంత ధరలే లెక్కలోకి వస్తున్నాయని బాధపడాలో తెలియని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మున్సిపాలిటీలో కలిపినప్పుడు పట్టణ నిబంధనలు.. భూములు సేకరించేటప్పుడు మాత్రం పల్లె ధరలా? అంటూ అన్నదాతలు అధికారులను నిలదీస్తున్నారు.

కోట్ల విలువ.. లక్షల్లో పరిహారం.!

రాయిగిరి ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరిగాయి. పట్టణ విస్తరణతో భూములకు డిమాండ్ పెరిగింది. అలాంటి భూములను అభివృద్ధి పనుల కోసం సేకరిస్తూ, కోట్ల విలువైన భూములకు లక్షల్లో పరిహారం నిర్ణయిస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూముల ప్రస్తుత విలువను పరిగణనలోకి తీసుకోకుండా తక్కువ ధరకు పరిహారం ప్రతిపాదించడం తమకు తీరని నష్టమని వాపోతున్నారు.

ఒకే సర్వే నంబర్ .. రెండు రకాల న్యాయమా.?

ఒకే సర్వే నంబర్‌లో భూములు కోల్పోతున్న రైతులందరికీ ఒకే విధమైన న్యాయమైన పరిహారం అందించాల్సి ఉండగా, పలుకుబడి ఉన్నవారి భూములకు ఒక రేటు.. సామాన్య రైతుల భూములకు మరో రేటు అన్న ఆరోపణలు రైతుల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. పరిహారం నిర్ణయంలో పారదర్శకత ఎక్కడుందని ప్రశ్నిస్తున్నారు. భూముల స్వభావం, ప్రస్తుత మార్కెట్ విలువ, చట్టబద్ధమైన భూసేకరణ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని పరిహారం నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ మళ్లీ భూములెందుకు కోల్పోవాలి.?

రాయిగిరి రైతులకు భూసేకరణ కొత్త కాదు. గతంలోనూ రహదారులు, వివిధ అభివృద్ధి పనుల కోసం భూములు కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ ప్రాంతీయ రహదారులు, విస్తరణ పనులతో భూములు కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. తరతరాలుగా కుటుంబాలను పోషించిన భూములు చేజారిపోతుంటే, అందుతున్న పరిహారంతో మరోచోట భూమి కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొందని చెబుతున్నారు. భూములు పోతే తమ కుటుంబాల భవిష్యత్తు ఏమిటని కన్నీటిపర్యంతమవుతున్నారు.

పట్టణ హోదా ఇచ్చి.. పల్లె ధరలెందుకు.?

మున్సిపాలిటీలో విలీనం చేసిన ప్రాంతానికి పన్నులు, ఇతర పాలనా వ్యవహారాల్లో పట్టణ నిబంధనలు వర్తింపజేస్తున్నప్పుడు భూసేకరణ పరిహారంలో మాత్రం గ్రామీణ ప్రాంత ధరలను పరిగణనలోకి తీసుకోవడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చిన భూముల విలువను కూడా అందుకు అనుగుణంగా పరిశీలించాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నిస్తున్నారు.

సీఎం సారూ.. రైతుల గోడు వినండి

రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాయిగిరి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. భూముల ప్రస్తుత విలువ, భూమి స్వభావం, వర్తించే భూసేకరణ చట్ట నిబంధనలను పరిశీలించి న్యాయమైన పరిహారం అందించాలని కోరుతున్నారు. పరిహారం నిర్ణయంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అందరికీ సమాన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

న్యాయం చేయకుంటే ఉద్యమమే.!

పరిహారం విషయంలో న్యాయం జరగకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు, ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో రైతుల జీవితాలను బలిచేయడం తగదని స్పష్టం చేస్తున్నారు. రైతుల భూములతో రహదారులు నిర్మించవచ్చు.. కానీ వారి బతుకులను మాత్రం రోడ్డున పడేయొద్దు. మున్సిపాలిటీలో విలీనమైన రాయిగిరి రైతులకు న్యాయమైన పరిహారం అందించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



కారులో మత్తు ముడిసరుకు.!

- 56 కిలోల క్లోరల్ హైడ్రేట్ పట్టివేత
- హైదరాబాద్ కు తరలిస్తుండగా పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు
- ఒకరి అరెస్టు.. మరొకరు నిందితుడు

ప్రజా వాయిస్,సంగారెడ్డి: మత్తు పదార్థాల అక్రమ రవాణాను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడ్డుకున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఎన్‌హెచ్-161, ఎన్‌హెచ్-65 జాతీయ రహదారుల కూడలి వద్ద శనివారం తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు మారుతి ఎర్టిగా కారులో తరలిస్తున్న 56 కిలోల క్లోరల్ హైడ్రేట్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రెండు బ్యాగుల్లో 28 కిలోల చొప్పున ఈ నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ ఘటనలో కామారెడ్డి జిల్లా పెద్దకోడపగల్ మండలం అంజని గ్రామానికి చెందిన బి. ఉమాకాంత్ గౌడ్ (28)ను అరెస్టు చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జలాల్‌పూర్‌కు చెందిన తిప్పారం వెంకట్ గౌడ్ (40) క్లోరల్ హైడ్రేట్ కొనుగోలు, విక్రయాల్లో సంబంధం ఉన్నట్లు గుర్తించి నిందితుడిగా చేర్చారు. కారు, మత్తు పదార్థంతో పాటు అరెస్టయిన వ్యక్తిని తదుపరి చర్యల నిమిత్తం సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.తనిఖీల్లో సీఐలు శ్రీనివాస్, బాధ్యనాథ్ చౌహాన్, ఎస్ఐ శంకర్, హెడ్ కానిస్టేబుల్ నరసింహారెడ్డి, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ప్రహ్లాద్ రెడ్డి, నజీమ్, సుధాకర్, ముజామిల్, ఉమా పాల్గొన్నారు.





చెరువులో కబ్జాలకు హైడ్రా చెక్

- 4 ఎకరాలు స్వాధీనం
- సందపల్లి చెరువులో అక్రమ నిర్మాణాల తొలగింపు
- ఎఫ్ టీఎల్ పరిధిలో ఇల్లు, షెడ్ నేలమట్టం
- 1,600 మీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు

ప్రజావాయిస్‌||శంషాబాద్: చెరువుల భూములను ఆక్రమించి ప్రైవేట్ ఆస్తులుగా మార్చుకోవాలనుకునే వారికి హైడ్రా మరోసారి అడ్డుకట్ట వేసింది.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం తొండుపల్లి గ్రామంలోని 76 ఎకరాల విస్తీర్ణం కలిగిన సందపల్లి చెరువులో ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టారు.చెరువు భూమిలోకి చొచ్చుకొచ్చి నిర్మించిన ప్రహరీలను తొలగించి సుమారు 4 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విముక్తి చేశారు.చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 100 గజాల స్థలంలో నిర్మించిన ఇంటితో పాటు పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డును కూడా హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు.చెరువు లోపలి భాగంలో ఆక్రమణలు జరుగుతున్నాయన్న సమాచారంతో సంబంధిత ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్లు నిర్ధారించుకున్న అనంతరం తొలగింపు చర్యలు చేపట్టారు.భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా చెరువు పరిధిలో 1,600 మీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా చెరువు భూమిగా గుర్తిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.చెరువుల పరిధిలో అక్రమ నిర్మాణాలకు తావులేకుండా భూములను రక్షించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు తెలిపారు.

మూడు పార్టీలకు ఒకేసారి సవాల్

- నిరుద్యోగం.. కృష్ణా జలాలపై శ్రీకాంత్ గౌడ్ సమరశంఖం
- పేపర్ లీకుల నుంచి నీటి దోపిడీ వరకు పాలకుల వైఫల్యాలను ఎండగట్టిన ఎమ్మెల్సీ అభ్యర్థి
- కవిత నాయకత్వంలో మరో ప్రజా ఉద్యమానికి సిద్ధమని ప్రకటన
- పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి



ప్రజా వాయిస్, నల్గొండ.నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన పాలకులకు పట్టభద్రులు ఓటుతో బుద్ధి చెప్పాలని నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సలమాస శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. నిరుద్యోగ సమస్య, ఉద్యోగ నియామకాలు, పేపర్ లీకేజీలు, కృష్ణా జలాల వివాదం వంటి కీలక అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ఒకేసారి రాజకీయ అస్త్రాలు సంధించారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని శాలిని రెసిడెన్సీలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయని, విద్యార్థులు పదేళ్లపాటు పడిన కష్టం, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు నీరుగారిపోయాయని శ్రీకాంత్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యత వహించి అప్పటి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న కేటీఆర్ ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఉద్యోగాల క్యాలెండర్ పేరుతో నిరుద్యోగుల వయసు పెరుగుతోందే తప్ప ఉద్యోగాలు మాత్రం రావడం లేదని విమర్శించారు.మెగా డీఎస్సీ, పోలీసు నియామకాల హామీల అమలు ఎక్కడని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న విద్యార్థులకు స్కూటీలు, విదేశీ విద్యా ఉపకార వేతనాలు, ఐదు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రవళిక ఆత్మహత్య, ఇంటర్మీడియట్ విద్యార్థుల మరణాల విషయంలో గత పాలకుల వైఖరిని విమర్శిస్తూ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఉద్యోగ విరమణ వయసును 58 నుంచి 61 ఏళ్లకు పెంచడం వల్ల నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయిందని బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. కాంట్రాక్టు అధ్యాపకులు, పార్ట్‌టైం అధ్యాపకులు, ఇతర ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

కృష్ణా జలాల విషయంలో రాజీ లేదు

నల్గొండ జిల్లా రైతుల నీటి హక్కుల విషయంలో ఇకపై ఎలాంటి రాజీ ఉండదని శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు. పల్నాడు వాటర్ గ్రిడ్ పేరుతో తెలంగాణ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అమరజీవి జలధార ప్రాజెక్టు పనులపై తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. కృష్ణా జలాల తరలింపును అడ్డుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. నల్గొండ రైతుల నీటి హక్కులను కాపాడేందుకు నాగార్జునసాగర్ వద్ద భారీ ప్రజా ఉద్యమాన్ని చేపడతామని ప్రకటించారు. కవిత నాయకత్వంలో రైతులను సమీకరించి తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు. ఫ్లోరోసిస్ బాధలు అనుభవించిన నల్గొండ జిల్లాకు మళ్లీ తాగు, సాగునీటి కష్టాలు రానివ్వబోమని పేర్కొన్నారు.

ఉద్యమకారులకు పట్టం కట్టాలి

సామాజిక న్యాయం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించాలని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కోట్లున్న నాయకులు కాకుండా ప్రజల కోసం కొట్లాడే ఉద్యమకారులను పట్టభద్రులు ఆదరించాలని కోరారు. వారసత్వ రాజకీయాలకు, పారాచూట్ నాయకులకు ఈ ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పాలన్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి విద్యార్థి ఉద్యమాల్లో ఎదిగిన సామాన్య బిడ్డనని, నిరుద్యోగుల కష్టాలు తనకు తెలుసని చెప్పారు. అశోక్‌నగర్ నిరుద్యోగుల నుంచి యూనివర్సిటీ విద్యార్థుల పరకు ప్రతి సమస్యపై పోరాడతానని, జర్నలిస్టులకు సైతం చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కవిత నాయకత్వంలో మరో ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతున్నామని, ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడతామని ప్రకటించారు. నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రెండో ప్రాధాన్యత ఓటు అయినా వేసి తనకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

దారి తప్పిన పసికూనలు.. దారి చూపిన ఖాకీలు

- అమ్మ ఒడిలో సుఖాంతం
- రెండు గంటల పాటు గాలించి చిన్నారులను తల్లి చెంతకు చేర్చిన నల్గొండ 2 టౌన్ పోలీసులు



ప్రజా వాయిస్ – నల్గొండ: చిన్నారులు దారి తప్పడంతో ఆ తల్లి గుండెల్లో ఆందోళన మొదలైంది.. బిడ్డలు ఎక్కడున్నారో తెలియక కన్నీరుమున్నీరుగా విలపించింది. మరోవైపు ఆ చిన్నారులను క్షేమంగా తల్లి ఒడికి చేర్చేందుకు పోలీసులు చేసిన ప్రయత్నం చివరకు ఆనందాన్ని నింపింది. ఖాకీ దుస్తుల వెనుక మానవత్వం, బాధ్యత దాగి ఉంటాయని నిరూపిస్తూ నల్గొండ 2 టౌన్ పోలీసులు ఇద్దరు చిన్నారులను సురక్షితంగా తల్లి చెంతకు చేర్చారు.నల్గొండ పట్టణంలోని మాన్యంచెల్క ప్రాంతానికి చెందిన ఇద్దరు చిన్నారులు ఉదయం అంగన్వాడీ కేంద్రానికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. అయితే చిన్నతనపు ఆటపాటల్లో పడి అంగన్వాడీకి వెళ్లకుండా ముందుకు సాగి దారి తప్పారు. అలా నడుచుకుంటూ విద్యానగర్‌లోని వసుధ టవర్స్ అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. అక్కడ లిఫ్ట్‌లో ఆడుకుంటున్న చిన్నారులను గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు వారి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. చిన్నారులు హిందీలో మాట్లాడుతుండటం, తమ ఇంటి చిరునామా చెప్పలేకపోవడంతో దారితప్పి వచ్చినట్లు గుర్తించారు. వెంటనే స్థానిక కార్పొరేటర్ కేసాని వేణుగోపాల్ రెడ్డి ద్వారా నల్గొండ 2 టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఎస్సై సైదాబాబు ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు ఎంఏ ఫరూక్, స్వామి వెంటనే అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. చిన్నారులకు తల్లిదండ్రుల పేర్లు, ఇంటి చిరునామా తెలియకపోవడంతో వారి ఆచూకీ కనుగొనడం సవాలుగా మారింది. అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా అపార్ట్‌మెంట్ వాసులు చంద్రశేఖర్ రెడ్డి, రేవంత్ రెడ్డి సహకారంతో చిన్నారులను బైక్‌లపై తీసుకెళ్లి బీటీఎస్, మాన్యంచెల్క తదితర ప్రాంతాల్లోని వీధులన్నీ కలియతిరిగారు. దాదాపు రెండు గంటల పాటు ఓపికగా గాలించారు. చివరకు మాన్యంచెల్కలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ఇద్దరు చిన్నారుల కోసం వెతుకుతున్నారనే సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్నారు. అంగన్వాడీ నిర్వాహకురాలు చిన్నారులను గుర్తించి సమీపంలోని వారి ఇంటికి పోలీసులను తీసుకెళ్లారు.ఉదయం నుంచి బిడ్డల ఆచూకీ తెలియక ఆందోళనతో ఎదురుచూస్తున్న తల్లికి చిన్నారులను క్షేమంగా అప్పగించడంతో ఆ ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది. కళ్లముందు బిడ్డలను చూసుకున్న ఆ తల్లి ఊపిరి పీల్చుకుని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా చిన్నారుల క్షేమం కోసం రెండు గంటల పాటు శ్రమించి ఓ తల్లి కన్నీళ్లను ఆనంద బాష్పాలుగా మార్చిన కానిస్టేబుళ్లు ఫరూక్, స్వామిలపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. పోలీసుల సేవాభావానికి, మానవత్వానికి ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది.

సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యమా?

- రామగుండం మున్సిపల్ అధికారికి రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు
- వారం రోజుల్లో పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశం..
- నిర్లక్ష్యంపై కమిషనర్ అసంతృప్తి



ప్రజా వాయిస్ గోదావరిఖని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నప్పటికీ నిర్ణీత గడువులో సమాచారం అందించని రామగుండం నగరపాలక సంస్థ ప్రజా సమాచార అధికారి (పీఐఓ) తీరుపై రాష్ట్ర సమాచార కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ తెలిపారు. బాధితుడికి వారం రోజుల్లో పూర్తి సమాచారం అందించడంతో పాటు, తీసుకున్న చర్యలపై కమిషన్‌కు నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన వివిధ నిర్మాణాలకు సంబంధించిన వివరాలు కోరుతూ మద్దెల దినేష్ 2025 డిసెంబర్ 30న సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. అయితే నిర్ణీత 30 రోజుల గడువులో సంబంధిత ప్రజా సమాచార అధికారి సమాచారం అందించలేదని తెలిపారు. దీంతో 2026 మార్చి 24న మొదటి అప్పీల్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

కమిషన్ విచారణలో అధికారుల తీరుపై అసంతృప్తి

ఈ అప్పీల్‌పై 2026 అక్టోబర్ 3న రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ సమక్షంలో విచారణ జరిగినట్లు దినేష్ వివరించారు. విచారణ సందర్భంగా సమాచారం అందించడంలో పీఐఓ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. బాధితుడికి వారం రోజుల్లో పూర్తి సమాచారం అందించాలని, అందుకు సంబంధించిన నివేదికను రాష్ట్ర సమాచార కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం–2005 ప్రకారం ప్రజలకు కోరిన సమాచారాన్ని నిబంధనల మేరకు అందించడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని మద్దెల దినేష్ పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా ప్రజలకు పారదర్శక పాలన, ప్రభుత్వ వ్యవహారాలపై జవాబుదారీతనం కల్పించాలన్న లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. సమాచారం ఇవ్వడంలో జాప్యం చేసే అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తేదీలే లేని తినుబండారాలు

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- తక్కువ నాణ్యత ముడి సరుకులతో అపరిశుభ్ర వాతావరణంలో నమ్కీన్ తయారీ
- తయారీ తేదీ, గడువు తేదీ లేకుండానే ప్యాకెట్ల విక్రయం..
- కీసర పోలీసుల తనిఖీల్లో బట్టబయలు.. కంపెనీపై కేసు నమోదు



ప్రజావాయిస్, కీసర:ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉండాల్సిన ఆహార తయారీ సంస్థలు.. లాభాల వేటలో నిబంధనలకు తిలోదకాలిస్తున్నాయా తినుబండారాల తయారీలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీ ముద్రించకుండానే విక్రయాలు సాగిస్తున్న ఓ నమ్కీన్ తయారీ కేంద్రం వ్యవహారం కీసర పోలీసుల తనిఖీల్లో వెలుగుచూసింది. అపరిశుభ్ర వాతావరణంలో, తక్కువ నాణ్యత కలిగిన ముడి సరుకులతో చకోడి, బూందీ, మిక్చర్ తదితర ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.కీసర పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. అనిల్ కుమార్‌కు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసు సిబ్బంది, ఇద్దరు పంచ సాక్షులతో కలిసి తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని 'శ్రీ కరణిమాతా నమ్కీన్ చిప్స్, చకోడి మరియు బూందీ కంపెనీ'లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల తయారీలో అపరిశుభ్రత, ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీల ముద్రణ లేకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.విచారణలో హైదరాబాద్ నుంచి తక్కువ నాణ్యత కలిగిన ముడి సరుకులు కొనుగోలు చేసి, అధిక లాభాల కోసం ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలు ముద్రించకుండా విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు పేర్కొన్నారు. ఒక్కో ప్యాకెట్‌పై సుమారు రూ.30 లాభం పొందుతున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు.పంచనామా చేసి సరుకు స్వాధీనంతనిఖీల్లో చకోడి, బూందీ, మిక్చర్, రత్లామి సేవ్, బాలాజీ పాపడ్ తదితర ఆహార పదార్థాలను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు

గుడుంబా గుడారాలపై పోలీసుల మెరుపుదాడి.!

- తెల్లవారుజామున తండాల్లో పోలీసుల జల్లెడ
- అక్రమ తయారీదారుల్లో గుబులు
- 4 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- 50 లీటర్ల నాటుసారా స్వాధీనం



ప్రజా వాయిస్,మహబూబాబాద్: జిల్లాలో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై పోలీసులు కొరడా ఝళిపిస్తున్నారు. చీకటి తొలగకముందే.. తెల్లవారుజామున చలిని సైతం లెక్కచేయకుండా తండాల్లోకి చొచ్చుకెళ్లి మెరుపు తనిఖీలు నిర్వహించారు. అక్రమ నాటుసారా తయారీ కేంద్రాలపై జల్లెడ పట్టి భారీ మొత్తంలో బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. పోలీసుల ఆకస్మిక తనిఖీలతో గుడుంబా తయారీదారుల్లో గుబులు మొదలైంది.మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 5:30 నుంచి 7:30 గంటల వరకు కేసముద్రం మండల పరిధిలోని చెరువు ముంతు తండా, బోడమాచ తండాల్లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సర్కిల్ పోలీసు సిబ్బంది సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు.తండాల్లోని అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు అక్రమ నాటుసారా తయారీ, నిల్వ, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో 4,000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తండాల్లో తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి రికార్డులు, ధ్రువపత్రాలను పరిశీలించారు.

అవగాహనతో పాటు హెచ్చరికలు..

తనిఖీల అనంతరం తండావాసులకు పోలీసులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధంపై వివరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని కేసముద్రం సీఐ సత్యనారాయణ స్పష్టం చేశారు. తెల్లవారుజామునే తండాల్లో పోలీసులు చేపట్టిన ఈ మెరుపు తనిఖీలు అక్రమ గుడుంబా తయారీదారులకు గట్టి హెచ్చరికగా నిలిచాయి. విధి నిర్వహణలో చలిని సైతం లెక్కచేయకుండా పోలీసులు చేపట్టిన చర్యలను పలువురు అభినందిస్తున్నారు.

భగవద్గీతపై పట్టు.. పీజీలో సత్తా చాటిన శ్రీలతారెడ్డి!

- ఉపాధ్యాయ వృత్తితో పాటు ఆధ్యాత్మిక విద్యలోనూ విజయకేతనం!
- 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత
- తెలంగాణ నుంచి నలుగురిలో ఒకరిగా గుర్తింపు
- అరుదైన ఘనత సాధించడం పట్ల ప్రజల నుండి ప్రశంసల జల్లు



ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: వికారాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తూర్పు శ్రీలతా రెడ్డి అరుదైన ఘనత సాధించారు. ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 81వ అకాడమిక్ కౌన్సిల్ సమావేశంలో 2023 డిసెంబర్ 19న ఎంఏ భగవద్గీత స్టడీస్ కోర్సుకు ఆమోదం తెలిపింది. 2024 జూన్ 26న అధికారిక ప్రకటన వెలువడగా, అదే ఏడాది జూలై లో ప్రారంభమైన తొలి బ్యాచ్ లో ఎం.ఏ. భగవద్గీత కోర్సులో 75 శాతం మార్కులతో పీజీ పూర్తి చేశారు.దేశంలోనే తొలిసారిగా ప్రారంభించిన ఈ ప్రత్యేక కోర్సులో తెలంగాణ రాష్ట్రం నుంచి ఉత్తీర్ణులైన నలుగురిలో శ్రీలత రెడ్డి ఒకరిగా నిలిచారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే ఆధ్యాత్మిక విద్యపై ఆసక్తితో ఉన్నత విద్యను అభ్యసించి ఈ విజయాన్ని అందుకున్నారు.ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తూనే విశ్వహిందూ పరిషత్ వికారాబాద్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వృత్తి బాధ్యతలతో పాటు విద్యాభ్యాసంలోనూ ప్రతిభ చాటిన శ్రీలతారెడ్డిని పలువురు అభినందిస్తున్నారు.

మత్తు వ్యూహంలో చిత్తవుతున్న పల్లెలు

- పట్టణ నుంచి పల్లెలకు అక్రమంగా మద్యం రవాణా
- గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో బెల్ట్ షాపులకు బహిరంగ వేలం పాట
- గ్రామఅభివృద్ధి ముసుగులో బహిరంగ వేలంపాట
- ఇల్లు కిరాణం కొట్టులలో 24 గంటల మద్యం అమ్మకాలు
- తూతు మంత్రంగా అధికారుల దాడులు
- నిఘా కరువవడం తో రెచ్చిపోతున్న వ్యాపారులు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి అది ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరైన పల్లె సీమ.. నేడు అక్రమ మద్యం మాఫియాకు అడ్డాగా మారింది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 'మద్యం' ఒక సామాజిక మహమ్మారిలా విస్తరించి, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పునాదులను పెకలిస్తోంది. ఒకవైపు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి సరిహద్దు దాటి వస్తున్న చౌకబారు మద్యం, మరోవైపు జిల్లాలోని పట్టణాల నుంచి పల్లెలకు తరలుతున్న 'బెల్ట్' దందా వెరసి.. జిల్లాను రెండు వైపుల నుంచి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం పట్టించుకోకపోవడంతో దందా జోరుగా కొనసాగుతుంది దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లైసెన్స్ పొందిన వైన్ షాపులు నిర్వాహకులు అందదండల సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఇల్లు కిరాణా దుకాణాలు విని వైన్ షాపుల్లో మారిపోతున్నాయి పట్టణం నుంచి పల్లెలకు సరఫరా అవుతున్నాయి నిర్మల్ బైపాస్ ఖానాపూర్ పట్టణాలతో పాటు మండల స్థాయి వరకు తదితర ప్రాంతాల్లో లైసెన్స్ పొందిన వైన్ షాప్ లో నుంచి మద్యం సీసాలు గ్రామాల్లోకి బెల్ట్ షాపులకు జరుగుతున్నాయి కొందరు వ్యాపారాలు సిండికేట్ గా మారి ఆటోలు ద్విచక్ర వాహనాలు రాత్రి సరిపడా చేస్తున్నాను.

సరిహద్దు దాటి వస్తున్న 'మహారాష్ట్ర' మత్తు!

మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్న కుభీర్, భైంసా, తానూర్, తదితర మండలాలు అక్రమ మద్యం రవాణాకు ప్రధాన కారిడార్లుగా మారాయి. మహారాష్ట్రలో మద్యం ధరలు తక్కువగా ఉండటంతో,అక్కడి వ్యాపారులతో చేతులు కలిపిన స్థానిక మాఫియా ద్విచక్ర వాహనాలు,కార్లు,ఆటోల ద్వారా రాత్రింబవళ్లు సరిహద్దు దాటిస్తోంది. ప్రధాన చెక్‌పోస్టులను తప్పించుకుని మట్టి రోడ్లు, వాగుల గుండా 'దేశీ దారూ' (నాటు సారా తరహా మద్యం), ఇతర చౌకబారు బ్రాండ్లను జిల్లాలోని మారుమూల గ్రామాలకు చేరవేస్తున్నారు.ఈ నాసిరకం మద్యం తాగడం వల్ల కూలీలు, యువత తీవ్ర అనారోగ్యం పాలవుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

'అభివృద్ధి' ముసుగులో బెల్ట్ వేలంపాటలు!

మరోవైపు నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలతో పాటు కుభీర్, సారంగాపూర్, చించోలి (బి), బీరవెల్లి తదితర ప్రాంతాల్లోని లైసెన్స్ పొందిన వైన్ షాపుల నుంచే గ్రామాల్లోని బెల్ట్ షాపులకు నేరుగా మద్యం సరఫరా అవుతోంది.అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే.. జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రామ అభివృద్ధి కమిటీల (VDC) ఆధ్వర్యంలోనే బెల్ట్ షాపుల నిర్వహణకు బహిరంగంగా వేలంపాటలు నిర్వహిస్తున్నారు.'గ్రామ అభివృద్ధికి నిధులు' అనే ముసుగులో లక్షలాది రూపాయలకు బెల్ట్ షాపులను కట్టబెడుతున్నారు. చట్టవిరుద్ధమైన ఈ వేలంపాటలు ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాలుగా మారాయి

ఇళ్లు, కిరాణా కొట్లే మినీ వైన్ షాపులు.. ఎమ్మార్పీకి మించి దోపిడీ!

వేలంలో లక్షలు పోసి దక్కించుకున్న నిర్వాహకులు, తమ పెట్టుబడిని రెట్టింపు చేసుకోవడానికి గ్రామంలోని ఇళ్లు, కిరాణా దుకాణాలు, పాన్ షాపులను మద్యం విక్రయ కేంద్రాలుగా మార్చేశారు. అధికారిక దుకాణాలకు సమయపాలన ఉన్నా, ఇక్కడ మాత్రం 24 గంటలూ మద్యం దొరుకుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఎమ్మార్పీ (MRP) కంటే క్వార్టర్ సీసాపై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తూ రెక్కాడితే గానీ డొక్కాడని పేదల జేబులకు చిల్లు పెడుతున్నారు.



చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు.. ఆందోళనలో మహిళలు

పాలు, కూరగాయలు దొరికే కిరాణా కొట్లలోనే మందు సీసాలు దొరుకుతుండటం తో యువత, మైనర్లు సైతం మత్తుకు బానిసలవుతున్నారు. రోజువారీ కూలీ డబ్బులన్నీ మద్యానికే ఖర్చవుతుండటంతో కుటుంబ పోషణ భారమై, ఇళ్లలో నిత్యం గొడవలు జరుగుతున్నాయి.ఎన్నో కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి రోడ్డున పడుతున్నాయి.

తూతూమంత్రపు దాడులు.. అసలు సూత్రధారులకు రక్షణ !

జిల్లాలో ఇంత బహిరంగంగా బెల్ట్ వేలం పాటలు, సరిహద్దు రవాణా జరుగుతున్నా ఎక్సైజ్, పోలీసు శాఖల నిఘా పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి.ఉన్నతాధికారుల ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రమే అప్పుడప్పుడు చిన్నపాటి బెల్ట్ షాపులపై తూతూమంత్రపు దాడులు చేసి, రెండు నాలుగు సీసాలు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు.కానీ, మద్యాన్ని సరఫరా చేస్తున్న అసలు వైన్ షాపుల యజమానులపై గానీ, మహారాష్ట్ర సరిహద్దు మాఫియాపై గానీ కఠిన చర్యలు తీసుకోవడం లేదు.ఇప్పటికైనా మేల్కొనకపోతే ఎలా? పల్లెలను మత్తులో ముంచి, భవిష్యత్ తరాలను నిర్వీర్యం చేస్తున్న ఈ అక్రమ దందా పై జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.సరిహద్దుల్లో పటిష్ట నిఘా, వేలంపాటలు నిర్వహించే కమిటీలపై చట్టపరమైన చర్యలు, అక్రమ సరఫరా చేసే వైన్ షాపుల లైసెన్సుల రద్దు వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే నిర్మల్ జిల్లాకు ఈ 'మత్తు' పీడ విరుగుడు లభిస్తుంది.

నాటుసారా పై ఎక్సైజ్ దాడులు.!

- ఐదు లీటర్ల నాటుసారాతో మహిళ పట్టివేత
- కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్
- తయారీ, విక్రయాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు: ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్



ప్రజా వాయిస్,మహబూబాబాద్: నాటుసారా విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మహబూబాబాద్ మండలంలోని మూడుకొట్ల సెంటర్, బాబునాయక్ తండా, అయోధ్య గ్రామాల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బొమ్మగాని సామ్రాజ్యం అనే మహిళ నాటుసారా విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం మహబూబాబాద్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు.నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ హెచ్చరించారు. అక్రమ నాటుసారా కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ దాడుల్లో ఎస్ఐలు శ్రీనివాస్, సంతోష్, కానిస్టేబుళ్లు నాగరాజు, విజయ్, జాన్ పాషా, గోపి పాల్గొన్నారు.

ట్రాక్టర్ చక్రాల కింద పడి వ్యక్తి మృతి

- పనులు ముగించుకుని వస్తుండగా ప్రమాదం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత



ప్రజా వాయిస్/మర్వల్లి: ట్రాక్టర్ చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన మర్వల్లి మండలంలో చోటుచేసుకుంది.మండలంలోని జాజిగుబ్బడి తండాకు చెందిన కరణ్‌కోట్ రాజు (42), శుక్రవారం గ్రామానికి చెందిన కుంచారం బాల్‌రెడ్డి ట్రాక్టర్‌పై కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చక్రాల కింద పడ్డారు. వెంటనే అతడిని సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న రాజు మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.ఈ ఘటనతో జాజిగుబ్బడి తండాలో విషాదఛాయలు అలముకున్నాయి.



అమెరికాలో మునుగోడు యువకుడి దుర్మరణం

- ఉన్నత చదువులు.. ఉద్యోగంతో భవిష్యత్తుపై ఎన్నో ఆశలు
- న్యూయార్క్ రోడ్డు ప్రమాదంలో సాయితేజ (25) మృతి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దిగ్భ్రాంతి

ప్రజా వాయిస్ ,మునుగోడు: నల్లగొండ జిల్లా మునుగోడు పట్టణానికి చెందిన వీరమళ్ల సాయితేజ (25) అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కష్టపడి చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించి, అమెరికాలో ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడుతున్న తరుణంలో సాయితేజ అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆశలతో విదేశాలకు వెళ్లిన యువకుడు ఇలా విగతజీవిగా మారడం కలచివేసిందన్నారు.ఈ విషాద సమయంలో సాయితేజ కుటుంబ సభ్యులకు ఆ దేవుడు కొండంత మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పింఛన్ మంజూరుకు లంచం.!

- వితంతు పింఛన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు రూ.10 వేలు డిమాండ్
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ.. పక్కా వల
- నగదు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన లక్ష్మీపూర్ పంచాయతీ కార్యదర్శి

ప్రజా వాయిస్, మానకొండూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అవినీతి బాగోతం వెలుగుచూసింది. అర్హులైన నిరుపేదలకు అందాల్సిన వితంతు పింఛన్ మంజూరు ప్రక్రియను పూర్తి చేసేందుకు ఓ పంచాయతీ కార్యదర్శి రూ.10 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు లంచం తీసుకుంటున్న కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లావుడ్య చవన్ లాల్ శుక్రవారం ఏసీబీ వలకు చిక్కారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి కోడలికి ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత వితంతు పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేసేందుకు కార్యదర్శి రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ ఉంది.దీనిపై బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు ప్రణాళిక ప్రకారం ఫిర్యాదుదారుడి నివాసంలో నిఘా ఏర్పాటు చేశారు. కార్యదర్శి నగదు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, ఆయన వద్ద నుంచి రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని పేర్కొన్నారు.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.





పింఛన్ మంజూరుకు పైసల వసూళ్లు..!

- అర్హత ఉన్నా.. లంచం ఇవ్వకుంటే చేయూత అందని దుస్థితి
- కొత్త పింఛన్ల మంజూరులోనూ అక్రమాల ఆరోపణలు
- కార్యదర్శుల చేతివాటంతో పథకానికి దూరమవుతున్న పేదలు
- సైదాపూర్ మండలంలోనూ ఇదే తరహా పరిస్థితులు..!



ప్రజా వాయిస్ సైదాపూర్ :–పేదలకు ఆసరాగా నిలవాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొందరు కిందిస్థాయి అధికారులకు ఆదాయ వనరులుగా మారుతున్నాయా..? అర్హులైన నిరుపేదలకు చేయూత అందించాల్సిన బాధ్యతను విస్మరించి, పింఛన్ మంజూరు పేరుతో చేతులు తడుపుకోవాలని చూస్తున్నారా..? తాజాగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటన ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఫిర్యాదుదారుడి కోడలికి వితంతు పింఛన్ మంజూరు చేయించేందుకు లంచం డిమాండ్ చేయడం, చివరకు బాధితుడి ఇంట్లోనే డబ్బులు తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కడం అధికార యంత్రాంగంలో చోటు–చేసుకుంటు–న్న అవినీతికి అద్దం పడుతోంది.

- అర్హులకు అందని చేయూత..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీ–వల కొత్తగా చేయూత పింఛన్ల మంజూరుకు అవకాశం కల్పించడంతో వేలాది మంది నిరుపేదలు ఆశగా దరఖాస్తు చేసుకున్నారు. వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు తమకు ఆసరా లభిస్తుందని ఎదురుచూశారు. అయితే క్షేత్ర స్థాయిలో కొందరు అధికారుల వ్యవహారశైలి ఈ ఆశలపై నీళ్లు చల్లుతున్నట్లు– ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హతలు ఉన్నప్పటికీ పింఛన్ మంజూరు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగడంతో పాటు– కొందరికి లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఎదురవుతోందనే విమర్శలు ఉన్నాయి. అడిగిన మొత్తాన్ని ఇచ్చుకోలేని పేదలు చివరకు పింఛన్ జాబితాలో చోటు– దక్కించుకోలేకపోతున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది.

సైదాపూర్ లోనూ ఇదే తీరు..

సైదాపూర్ మండలంలోనూ కొత్త పింఛన్ల మంజూరు వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్హులైనప్పటికీ పింఛన్లు మంజూరు కాకపోవడం, మరోవైపు ఆర్థిక స్థోమత ఉన్నవారు, వ్యాపారాలు నిర్వహిస్తున్నవారి పేర్లు జాబితాల్లో ఉండటంపై గతంలోనే విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు కార్యదర్శులు అడిగిన డబ్బులు ఇవ్వలేక పలువురు అర్హులు పింఛన్లకు దూరమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి వ్యవహారాలపై బాధితులు బహిరంగంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో అక్రమాలు వెలుగులోకి రావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వెలుగులోకి రాని అక్రమాలెన్నో..

మానకొండూర్ ఘటనలో బాధితుడు ధైర్యంగా ఏసీబీని ఆశ్రయించడంతో లంచం వ్యవహారం బయటపడింది. కానీ ప్రతి గ్రామంలోనూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటు–న్న పేదలు ఎంతమంది ఉన్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత ఉండాల్సిన చోట మధ్యవర్తులు, కిందిస్థాయి సిబ్బంది జోక్యం పెరిగితే అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. పింఛన్ల మంజూరు ప్రక్రియపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అర్హతలున్నా పింఛన్లు రాని వారి వివరాలను సేకరించాలని ప్రజలు కోరుతున్నారు. సైదాపూర్ మండలంలోనూ పింఛన్ల జాబితాలను సమగ్రంగా పరిశీలించి, అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గిరిజన గర్జన..భద్రాచలం బంద్ సక్సెస్.!

- శరత్ హత్యతో రగిలిన ఆగ్రహజ్వాల..
- న్యాయం కోసం వీధుల్లోకి ఆదివాసీలు
- జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో బంద్ విజయవంతం
- స్వచ్ఛందంగా మూతపడిన దుకాణాలు, విద్యాసంస్థలు
- బస్టాండ్ ఎదుట రాస్తారోకో.. ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్
- పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసిన ఆందోళన



ప్రజా వాయిస్, భద్రాచలం: ఒక యువకుడి హత్య.. గిరిజన గడ్డపై తీవ్ర ఆగ్రహం తమ బిడ్డకు న్యాయం చేయాలంటూ ఆదివాసీలు ఒక్కతాటిపైకి వచ్చారు. ఈ నెల 16న హత్యకు గురైన గిరిజన యువకుడు తెల్లం శరత్ మృతికి నిరసనగా ఆదివాసీ జేఏసీ, అఖిలపక్షం ఇచ్చిన పిలుపుతో భద్రాచలం పట్టణ బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే నాయకులు బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రధాన రహదారులు, కాలనీల్లో నిరసన తెలిపారు. బంద్‌కు వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించడంతో దుకాణాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. అయితే ఆర్టీసీ బస్సులు, ఆటోల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.బంద్ అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నాయకులు రాస్తారోకో నిర్వహించారు. గిరిజన ప్రాంతమైన భద్రాచలంలో గిరిజనులకే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శరత్ హత్య ఘటనపై స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చొరవ చూపాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గద్దం స్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మానే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో బీజేపీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు పాల్గొన్నారు. బంద్‌కు సహకరించిన వ్యాపార వర్గాలు, రాజకీయ పార్టీలు, కుల సంఘాలకు ఆదివాసీ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో బంద్ ప్రశాంతంగా ముగిసింది.





చేపల వేటకు వెళ్లి.. కాలువలో విగతజీవిగా.!

- ప్రమాదవశాత్తు జారిపడి గంగపుత్రుడి మృతి
- భర్త కోసం రాత్రంతా వెతుకులాట
- కాలువలో కనిపించిన కృష్ణ మృతదేహం
- ముగ్గురు కుమార్తెలకు తీరని శోకం

ప్రజా వాయిస్,దుబ్బాక:చేపల వేటే జీవనాధారం ఆ వేటే చివరకు ప్రాణాల మీదకు తెచ్చింది. కుటుంబ పోషణ కోసం చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ గంగపుత్రుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి ప్రాణాలు కోల్పోయాడు. రోజూ ఇంటికి తిరిగొచ్చే భర్త.. ఆ రోజు విగతజీవిగా కనిపించడంతో భార్య గుండెలవిసేలా రోదించింది. ముగ్గురు కుమార్తెలకు తండ్రిని దూరం చేసిన ఈ విషాద ఘటన దుబ్బాక పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది.పట్టణానికి చెందిన పెంటం కృష్ణ (40) చేపల వేట వృత్తిగా చేసుకుంటూ భార్య ప్రియాంక, ముగ్గురు కుమార్తెలతో జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం పెద్దచెరువు కాలువ వద్దకు చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోవడంతో మృతి చెందినట్లు ఎస్సై కీర్తిరాజు తెలిపారు.ఎంతసేపటికీ భర్త ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన భార్య కుటుంబ సభ్యులతో కలిసి పెద్దచెరువు పరిసరాల్లో వెతికింది. చివరకు సమీప కాలువలో కృష్ణ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కృష్ణ మృతి చెందడంతో భార్య, ముగ్గురు చిన్నారుల రోదనలు మిన్నంటాయి.

ఉద్యోగాల ఆశ చూపి లక్షల్లో వసూళ్లు

- సింగరేణి, ఎన్టీపీసీ, వైద్య కళాశాలల్లో ఉద్యోగాల పేరుతో మోసం?
- ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల నుంచి బదిలీల వరకు వసూళ్ల ఆరోపణలు
- డబ్బులు తిరిగి అడిగితే బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్న బాధితులు



ప్రజా వాయిస్ పెద్దపల్లిఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, అవసరాల కోసం ప్రయత్నిస్తున్న కార్మికులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులే లక్ష్యంగా కొందరు వ్యక్తులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సింగరేణి, ఎన్టీపీసీ, వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగాల ఆశ చూపి డబ్బులు తీసుకోవడం, పనులు కాకపోవడంతో తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేయడం వంటి వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. సింగరేణి భద్రతా విభాగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, తమకు ప్రత్యేక పరిచయాలు ఉన్నాయని నమ్మబలికి పలువురి నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు మహిళల నుంచి కూడా నగదు వసూలు చేసినట్లు సమాచారం. ఎన్టీపీసీలో కాంట్రాక్టు ఉద్యోగాలు కల్పిస్తామని, సంస్థలోని అధికారులతో పరిచయాలు ఉన్నాయని నమ్మించి డబ్బులు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు.

బదిలీల పేరుతోనూ వసూళ్లు

సింగరేణి ఉద్యోగుల బదిలీలు చేయిస్తామంటూ యైటింక్లైన్ ప్రాంతంలో కొందరు కార్మికుల నుంచి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు శాఖలో ఎస్ఐ, కానిస్టేబుళ్ల బదిలీల పేరుతోనూ డబ్బులు తీసుకున్నారని, చివరకు హామీలు నెరవేరకపోవడంతో బాధితులకు రాతపూర్వక పత్రాలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిగితే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లకు భారీ డిమాండ్

సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాలకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు కీలకం కావడంతో ఈ సర్టిఫికెట్ల పేరుతో మరో రకమైన వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పుకుంటూ ఒక్కో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు రూ.80 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇటీవల రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో విచారణను కఠినతరం చేయడంతో కొందరి పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. దీంతో ముందుగా తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వకుండా బాధితులను తిప్పించుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాలు ఇప్పిస్తామంటూ లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేసిన ఘటనలు గతంలోనూ వివాదాలకు దారితీశాయి. రుణాలు మంజూరు కాకపోవడంతో బాధితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన సందర్భాలు ఉన్నట్లు సమాచారం. మంథని ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి ఎన్టీపీసీ బ్యాంకు ద్వారా రుణం ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకుని, పని పూర్తికాకపోవడంతో తిరిగి చెల్లింపుల విషయంలో పంచాయతీ జరిగినట్లు తెలుస్తోంది. తీసుకున్న నగదును తిరిగి ఇవ్వాలని బాధితులు కోరినప్పుడు కొందరు వ్యక్తులు తమ పలుకుబడిని ప్రస్తావిస్తూ బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు ఉన్న పరిచయాలు, పలువురు ప్రముఖులతో సంబంధాలు ఉన్నాయంటూ బాధితులను భయపెడుతున్నారని సమాచారం. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకున్న వ్యవహారంలో బాధ్యత వహించకుండా తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగాలు, బదిలీలు, ధ్రువీకరణ పత్రాలు, రుణాల పేరుతో డబ్బులు చెల్లించిన కొందరు బాధితులు తమకు న్యాయం జరగకపోవడంతో పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందన లేకపోవడంతో ఆధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు సమాచారం. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని జరిగే ఇలాంటి వసూళ్ల వ్యవహారాలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాస్తవాలు నిర్ధారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంస్థల అధికారిక హెచ్చరికలు ఎవరి కి డబ్బులు చెల్లించవద్దు...

సింగరేణి కాలరీస్, ఎన్టీపీసీ సంస్థలు తమ నియామక ప్రక్రియలో ఎలాంటి మధ్యవర్తులను అనుమతించవని, ఉద్యోగాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దని స్పష్టం చేశాయి. అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే నమ్మండి. ఏదైనా ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలైతే అది కేవలం ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్లలో లేదా ప్రభుత్వ ఉపాధి కల్పన పోర్టల్స్‌లో మాత్రమే ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు.

పోలీస్ శాఖ వారి సూచనలు

ఎవరైనా ఉద్యోగం పేరుతో డబ్బులు అడిగినా లేదా మీరు ఇప్పటికే డబ్బులు ఇచ్చి మోసపోయినా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయండి. ఆన్‌లైన్ ద్వారా లేదా ఫోన్ కాల్స్ ద్వారా ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయండి పోలీస్ వారి సూచన

ఏమైంది నా మంథనికి..?

- స్థానిక వ్యాపారాలపై ఒత్తిడి పెరుగుతోందా?
- వలస వ్యాపారుల పోటీ.. నిర్మాణ సామగ్రి నాణ్యతపై సందేహాలు
- వలస వ్యాపారుల పోటీ ప్రభావమెంత?
- మార్కెట్ పరిస్థితులపై చర్చ



ప్రజా వాయిస్ మంథని ఒకప్పుడు మంథని అంటేనే వ్యాపారానికి చిరునామా. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రధాన వాణిజ్య కేంద్రం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన వీధులు జనసందోహంతో కళకళలాడేవి. దుకాణాల్లో కొనుగోళ్ల సందడి కనిపించేది. చిన్న వ్యాపారి నుంచి పెద్ద వ్యాపారి వరకు తమ వ్యాపారాలతో జీవనోపాధి పొందేవారు. కానీ నేడు పరిస్థితులు మారుతున్నాయి. గతంతో పోలిస్తే వ్యాపారాలు మందగించాయని పలువురు స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో మంథనిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందన్న చర్చ స్థానికంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన వివిధ రకాల సామగ్రి విక్రయ రంగంలో కొత్త వ్యాపార సంస్థలు ఏర్పడుతున్నాయి. వీరి రాకతో మార్కెట్లో పోటీ పెరుగుతోందా? ధరల విషయంలో వస్తున్న మార్పులు స్థానికంగా ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై ప్రభావం చూపుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారాలు నిర్వహించడం తప్పు కాదు. ప్రతి ఒక్కరికీ చట్టబద్ధంగా వ్యాపారం చేసుకునే హక్కు ఉంది. అదే సమయంలో స్థానిక వ్యాపారుల మనుగడ, సమాన పోటీ పరిస్థితులు, వినియోగదారుల ప్రయోజనాలు కూడా ముఖ్యమే. పోటీ ఆరోగ్యకరంగా ఉండాలి తప్ప వ్యాపార రంగంలో అనవసరమైన అసమతుల్యతకు దారితీయకూడదు.

తక్కువ ధరకు వస్తువులా.. నాణ్యతకు ప్రాధాన్యమేదీ?

మరోవైపు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన వస్తువుల విక్రయాల్లో నాణ్యత అంశం కూడా చర్చనీయాంశంగా మారుతోంది. తక్కువ ధరలకు లభిస్తున్నాయని కొనుగోలు చేస్తున్న కొన్ని వస్తువుల నాణ్యతపై వినియోగదారులకు సందేహాలు ఉన్నాయా? ధర తగ్గింపు పేరుతో నాణ్యత విషయంలో రాజీ పడుతున్నారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణంలో ఉపయోగించే వస్తువుల నాణ్యత విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే నిర్మాణ సామగ్రిలో నాణ్యత లోపిస్తే దాని ప్రభావం భవనాల మన్నిక, భద్రతపై పడే అవకాశం ఉంది. అయితే ఏ దుకాణంలోనైనా నాణ్యతలేని వస్తువులు విక్రయిస్తున్నారనే నిర్ధారణకు ఆధారాలు అవసరం. సంబంధిత శాఖలు విక్రయిస్తున్న నిర్మాణ సామగ్రి ప్రమాణాలను పరిశీలించి వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వ్యాపార రంగం అభివృద్ధి చెందాలంటే స్థానిక వ్యాపారులకు అనుకూల వాతావరణం ఉండాలి. అదే సమయంలో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు అందాలి. వ్యాపారుల మధ్య పోటీ న్యాయబద్ధంగా ఉండాలి. స్థానిక వ్యాపార సంఘాలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కలిసి మంథని మార్కెట్ పరిస్థితులపై సమీక్షించాల్సిన అవసరం ఉంది. మంథని వ్యాపార రంగం మందగమనానికి అసలు కారణాలేమిటి? జిల్లాల పునర్విభజన ప్రభావమా? ఇతర ప్రాంతాల వ్యాపారుల నుంచి పెరుగుతున్న పోటీనా? మారుతున్న కొనుగోలు విధానాలా? వినియోగదారుల అభిరుచుల్లో మార్పులా? లేక పట్టణంలో అవసరమైన వాణిజ్య సదుపాయాల కొరతా? ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు వందలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన మంథని వ్యాపార రంగం మళ్లీ పుంజుకోవాలి. స్థానిక వ్యాపారులు నిలదొక్కుకోవాలి. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందాలి. పోటీతో కూడిన ఆరోగ్యకరమైన వాణిజ్య వాతావరణం ఏర్పడాలి. ఇది కేవలం వ్యాపారుల సమస్య కాదు.. మంథని ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. ఏమైంది నా మంథనికి..? మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేదెవరు?

చదువుకు చేయూత..నిరుద్యోగులకు బాసట.!

- పోటీ పరీక్షల అభ్యర్థులకు 'మిషన్ టీజీపీఎస్సీ' పుస్తకాల పంపిణీ
- సిటీ సెంటర్ లైబ్రరీలో ఇండియన్ జాగ్రఫీ పుస్తకాలు ఉచితంగా అందజేత
- లక్ష్యంపై గురి పెట్టండి.. సమయాన్ని సద్వినియోగం చేసుకోండి: శంకర్ నాయక్
- నిరంతర సాధనతోనే పోటీ పరీక్షల్లో విజయం సాధ్యం: పరికరాల నరేష్

ప్రజా వాయిస్, హైదరాబాద్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు అండగా నిలిచేందుకు నిరుద్యోగ జేఏసీ ముందుకొచ్చింది. చదువే లక్ష్యంగా కష్టపడుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను ఉచితంగా అందజేస్తూ ప్రోత్సహించింది. సిటీ సెంటర్ లైబ్రరీలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో 'మిషన్ టీజీపీఎస్సీ' ఇండియన్ జాగ్రఫీ పుస్తకాలను పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి నల్గొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పరికరాల నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటూ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా ఇప్పటికే ఎన్నో పుస్తకాలను అందించిన రచయిత అనిల్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పరికరాల నరేష్ మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడమే కాకుండా నేర్చుకున్న అంశాలను నిరంతరం ప్రాక్టీస్ చేయాలని, తమలోని లోపాలను గుర్తించి సరిదిద్దుకుంటూ ప్రతి అంశంపై పట్టు సాధించాలని సూచించారు. నిరుద్యోగ జేఏసీ నేత రవి యాదవ్ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అభ్యర్థులకు సూచించారు.కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు దామోదర్ రెడ్డి, కుమార్ రాథోడ్, రవి నాయక్, సవాయ్ సింగ్, వేణు, ప్రశాంత్, అనిల్ కుమార్ గౌడ్, హర్షిత, వీర తదితరులు పాల్గొన్నారు.





కరీంనగర్‌లో కాషాయ కదనభేరి.!

- 23న లక్ష మందితో బీజేపీ మహాపాదయాత్రకు సన్నాహాలు
- దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన శక్తుల తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలి
- ఎల్కతుర్తి నుంచి భారీగా తరలిరావాలి
- పార్టీ శ్రేణులకు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ పిలుపు

ప్రజా వాయిస్,ఎల్కతుర్తి:కాషాయ సైన్యం కదం తొక్కాలి.. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శక్తుల తప్పుడు ప్రచారాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి.. అంటూ బీజేపీ మండల అధ్యక్షుడు మస్తుర్తి శ్రీకాంత్ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నెల 23న కరీంనగర్‌లో నిర్వహించనున్న భారీ మహాపాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఎల్కతుర్తి మండల కేంద్రంలో మస్తుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రభారి లక్కీ రెడ్డి తిరుమల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి ప్రచారాలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల్లోకి వెళ్లి తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై దేశ యువత విశ్వాసంతో ఉందని, దేశ అభివృద్ధి, జాతీయ భద్రత, దేశ స్వాభిమానం వంటి అంశాల్లో మోదీ నాయకత్వాన్ని ప్రజలకు వివరించడమే మహాపాదయాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నెల 23న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో లక్ష మందితో భారీ మహాపాదయాత్ర నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.ఎల్కతుర్తి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాపాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యాత్ర విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు. ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడిగడ్డలో ఏమిటీ పరిస్థితి.?

- శిలాఫలకాలు మాయం
- ఇసుక తరలింపు యథేచ్ఛ
- ప్రారంభోత్సవ గుర్తులు కనుమరుగు
- సిమెంట్ దిమ్మెలపైనే ఆనవాళ్లు
- భారీ వాహనాలతో ఇసుక రవాణా
- అనుమతులు, పర్యవేక్షణపై సందేహాలు
- ఇరిగేషన్ , మైనింగ్ శాఖల తీరుపై స్థానికుల ప్రశ్నలు

ప్రజా వాయిస్, మేడిగడ్డ కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ వద్ద చోటుచేసుకుంటున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. 2019లో ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ప్రస్తుతం కనిపించడం లేదు. వాటిని అమర్చిన సిమెంట్ దిమ్మెలు మాత్రమే మిగిలాయి. మరోవైపు బ్యారేజీ పరిసరాల్లో భారీ వాహనాల ద్వారా ఇసుక రవాణా జరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కీలకమైన ప్రాజెక్టు వద్ద ఈ పరిస్థితులు నెలకొనడంపై పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కనిపించని నల్లరాతి పలకలు

2019 జూన్ 21న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద ప్రముఖుల పేర్లతో శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటి స్థానంలో సిమెంట్ దిమ్మెలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఒక పలకం దెబ్బతిని కిందపడటంతో భద్రత దృష్ట్యా కార్యాలయానికి తరలించినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపినట్లు సమాచారం. అయితే మరో పలకం కూడా కనిపించకపోవడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని ఎప్పుడు తొలగించారు? ఎక్కడ భద్రపరిచారు? తిరిగి ఏర్పాటు చేస్తారా? అనే వివరాలు వెల్లడించాల్సి ఉంది.

భారీ వాహనాలతో ఇసుక రవాణా

బ్యారేజీ పరిసరాల్లో భారీ వాహనాల ద్వారా ఇసుక తరలింపు జరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నాయా? ఎంత పరిమాణంలో తరలిస్తున్నారు? ఏ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రవాణా చేసే వాహనాల వివరాలు, అనుమతి పత్రాలు, తరలింపు మార్గాలపై అధికారులు తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పర్యవేక్షణ బాధ్యత ఎవరిది.?

మేడిగడ్డ బ్యారేజీ ఇప్పటికే పిల్లర్ల కుంగుబాటు, నిర్మాణపరమైన సమస్యలు, మరమ్మతుల అంశాలతో వార్తల్లో నిలిచింది. ఇలాంటి కీలక ప్రాజెక్టు పరిసరాల్లో జరిగే కార్యకలాపాలపై ఇరిగేషన్, మైనింగ్ శాఖలు నిరంతరం నిఘా ఉంచాల్సి ఉంది. శిలాఫలకాల తరలింపు వివరాలు వెల్లడించడంతో పాటు ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, నిబంధనల అమలుపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.





కార్తీక మాసి శోభతో ఆధ్యాత్మిక వైభవం..

ఉద్దెమర్రి విష్ణు శివాలయంలో ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం!

400 ఏళ్ల చారిత్రక ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..

ఆలయ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరి-ప్రసాద్ ఆధ్వర్యంలో వైభవంగా పూజా కార్యక్రమాలు..

ఎల్లగూడెం ఎల్లం శంకర్ - మాధవి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం..

అయ్యప్ప స్వాములకు అల్పాహారం



శామీర్ పేట / ప్రజా వాయిస్ :

కార్తీక మాస పవిత్రతను పురస్కరించుకుని మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉద్దెమర్రి గ్రామంలో వెలసిన సుమారు 400 సంవత్సరాల చారిత్రక శ్రీ అక్కన్న మాదన్న శ్రీ విష్ణు శివాలయంలో శనివారం ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఆలయ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పూలతో, మామిడి తోరణాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు భక్తిపూర్వకంగా సాగాయి. గ్రామానికి చెందిన భక్తులు తమ కుటుంబ సభ్యులతో, దంపతులుగా వ్రతంలో పాల్గొని సత్యనారాయణ స్వామివారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. వ్రతంలో భాగంగా స్వామివారికి షోడశోపచార పూజలు, పుష్పార్చనలు, అష్టోత్తర శతనామావళి పఠనం, సత్యనారాయణ స్వామి వ్రత కథా శ్రవణం, హారతి తదితర పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, గ్రామ ప్రజల సుభిక్షం కోసం ప్రార్థనలు చేశారు.

అన్నదానం మహాదానం..

పూజా కార్యక్రమాల అనంతరం ఎల్లగూడెం గ్రామానికి చెందిన ఎల్లం శంకర్ – మాధవి దంపతులు దాతలుగా ముందుకు వచ్చి ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో భగవంతుని సేవతో పాటు ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం ఎంతో పుణ్యప్రదమనే స్ఫూర్తితో వారు చేసిన అన్నదాన సేవను భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్దెమర్రి గ్రామంతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్ప స్వాములు, గ్రామ పెద్దలు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావం కలగలిసిన ఈ వేడుక ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.భక్తితో చేసే పూజ మనసుకు ప్రశాంతతనిస్తుంది.. సేవతో చేసే అన్నదానం సమాజానికి స్ఫూర్తినిస్తుంది.

పాఠ్యపుస్తకాల నుంచి పంట పొలాలకు....

ముథోల్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో విద్యార్థుల సందడి

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన

శాస్త్రీయ వ్యవసాయం, నేల సారం, విత్తన ఎంపికపై శాస్త్రవేత్తల వివరణ





నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

తరగతి గది పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు ప్రకృతి, వ్యవసాయ రంగంపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించే ఉద్దేశంతో శనివారం క్షేత్రస్థాయి పర్యటన (ఫీల్డ్ ట్రిప్) నిర్వహించారు.ఇందులో భాగంగా విద్యార్థులు ముథోల్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి ఆధునిక సాగు మెలకువలను తెలుసుకున్నారు.శాస్త్రీయ సాగుపై ఆసక్తికర విశ్లేషణ.ఈ పర్యటనలో భాగంగా పరిశోధనా కేంద్రంలోని శాస్త్రవేత్తలు,అధికారులు విద్యార్థులకు క్షేత్రస్థాయిలో పంటలను చూపిస్తూ సాగు విధానాలను వివరించారు. ముఖ్యంగా అధిక దిగుబడినిచ్చే మేలురకం విత్తనాల ఎంపిక, నేల సారాన్ని కాపాడుకునే పద్ధతులు, సేంద్రియ ఎరువుల వినియోగం,మరియు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే ఆధునిక వ్యవసాయ పరికరాల పనితీరు గురించి సులభంగా అర్థమయ్యేలా తెలియజేశారు. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు.పుస్తకాల్లో చదువుకున్న శాస్త్రీయ అంశాలను కళ్లారా చూసి,పంట పొలాల్లో తిరుగుతూ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కొత్త విషయాలను నేర్చుకున్నారు.పంటలకు వచ్చే చీడపీడల నివారణ, వాతావరణ మార్పులను తట్టుకునే పంటల గురించి శాస్త్రవేత్తలను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.విద్యార్థి దశ నుంచే వ్యవసాయం పట్ల గౌరవం, అవగాహన పెంపొందించడానికి ఇలాంటి పర్యటనలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

విద్యాకుసుమాలకు 'ప్రజా ట్రస్ట్' అక్షర ఆసరా..
తానూర్ మండలంలోని 5 విద్యాసంస్థల్లో ఉచిత పుస్తకాల పంపిణీ

కొలూర్, తానూర్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో సేవా కార్యక్రమం.. హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

సమకాలీన రాజకీయాల్లో అధికారం,పదవులు ఉన్నప్పుడే ప్రజల మధ్యకు వెళ్లే నాయకులు కనిపిస్తున్న తరుణంలో, ఎలాంటి పదవీ ఆశ లేకుండా కేవలం సేవా దృక్పథంతో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవడం ఒక విలక్షణమైన పరిణామం. ముథోల్ నియోజకవర్గ పరిధిలో ' భోస్లే మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్' సాగిస్తున్న సేవా కార్యక్రమాలు ఇప్పుడు స్థానిక రాజకీయ,సామాజిక వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి.సామాన్య ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ,ముఖ్యంగా రాబోయే తరాల భవిష్యత్తును తీర్చిదిద్దే 'విద్య'ను ప్రధాన ఆయుధంగా ఎంచుకోవడం ఆయన దూరదృష్టికి నిదర్శనంగా మేధావులు విశ్లేషిస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు అక్షర ఆసరా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు సరైన స్టడీ మెటీరియల్ లేక వార్షిక పరీక్షల్లో వెనుకబడకూడదనే సదుద్దేశంతో ప్రజా ట్రస్ట్ ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.శనివారం తానూర్ మండలంలోని ఐదు ప్రధాన ప్రభుత్వ విద్యాసంస్థల్లోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా 'ఆల్ ఇన్ వన్' పుస్తకాలను పంపిణీ చేశారు. స్వయంగా విద్యాసంస్థలకు వెళ్లిన మోహన్‌రావు పాటిల్, తన చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.కొలూర్ గ్రామంలోని 10వ తరగతి విద్యార్థులకు తానూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (11వ, 12వ తరగతి) విద్యార్థులకు తానూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు తానూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు తానూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (ఖ+దీఎ) 10వ తరగతి విద్యార్థినులకు ఈ మెటీరియల్ అందజేశారు.సామాజిక కోణం.భవిష్యత్తు పునాది తాత్కాలిక తాయిలాల కంటే శాశ్వత ప్రయోజనం చేకూర్చే విద్యకు చేయూతనివ్వడం ద్వారా సమాజంలో సమూల మార్పు తీసుకురావచ్చని మోహన్‌రావు పాటిల్ బలంగా నమ్ముతున్నారు."విద్యార్థుల అభివృద్ధే సమాజ అభివృద్ధి" అనే నినాదంతో ఆయన చేస్తున్న ఈ కృషి,పేద తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతోంది.పరీక్షల సమయంలో అందించిన ఈ అక్షర కానుక తమకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులు,అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజా క్షేత్రంలో చెరగని ముద్రఒకవైపు వ్యాపార, సామాజిక రంగాల్లో రాణిస్తూనే, మరోవైపు ప్రజా ట్రస్ట్ ద్వారా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భోస్లే మోహన్‌రావు పాటిల్, క్షేత్రస్థాయిలో బలమైన ప్రజాదరణను కూడగట్టుకుంటున్నారు.ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించడం,యువతను ప్రోత్సహించడం,ఇప్పుడు విద్యాసంస్థల్లో పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువయ్యారు.నిస్వార్థ సేవతో కూడిన ఆయన పనితీరు భవిష్యత్తులో ప్రజాక్షేత్రంలో ఆయనకు తిరుగులేని గుర్తింపును,ఆదరణను తీసుకురావడం ఖాయమని స్థానిక విశ్లేషకులు,మేధావులు అభిప్రాయపడుతున్నారు.

మున్సిపల్ కార్మికురాలిపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి

బాలకృష్ణ అతని తల్లిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచెయ్యాలి

సీఐటీయూ డిమాండ్

కుమ్మరి కుంట్ల నాగన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కంపెళ్ళి శ్రీనివాస్

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి



ప్రజా వాయిస్ మహబూబాబాద్

జిల్లా కేంద్రంలో నల్గొండ పట్టణ కేంద్రంలో పారిశుద్ధ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న చందుపట్ల రమణమ్మ పై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న కంపెళ్ళి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రమణమ్మ పై జరిగిన దాడికి వ్యతిరేకంగా మహబూబాబాద్ పట్టణంలో శ్రీనివాస్ థియేటర్ సెంటర్లో సిఐటియు అనుబంధ సంఘం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ పట్టణానికి చెందిన బాలకృష్ణ మరియు అతని తల్లి ఇద్దరూ, మున్సిపల్ కార్మికురాలి గా విధులు నిర్వహిస్తున్న చందుపట్ల రమణమ్మ అనే కార్మికురాలిపై అకారణంగా కట్టెతో వెంటపడి మరి దాడి చేసి గాయపరిచారన్నారు .పారిశుద్ధ కార్మికులు పుర ప్రజలు అందరికి సమానమైన సేవలు అందిస్తూ నిరంతరం అందుబాటులో ఉంటున్నారని, అటువంటి కార్మికుల పట్ల ఈ రకమైన దౌర్జన్యాలు,కుల దురహంకార దాడులను చేయడాన్ని యావత్ సమాజం ఖండించాలన్నారు. దాడికి పాల్పడ్డ బాలకృష్ణ మరి అతని తల్లిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులపై దాడులు జరిగిన సందర్భంలో స్థానికంగా ఉన్న అధికార యంత్రాంగము, స్థానిక ప్రజాప్రతినిధులు అనుసరిస్తున్న నిర్లక్ష్య విధానాలు కూడా ఈ దాడులకు ఒక కారణమన్నారు.ఇప్పటికే అతి తక్కువ వేతనాలు పొందుతూ,ఇచ్చే వేతనాలు సైతం నెల సక్రమంగా లేక, సామాజిక భద్రతా పథకాలు సరిగా అమలు కాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న మున్సిపల్ కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సింది పోయి ఈ రకమైన కులాంతర దాడులను చేయడం సరైంది కాదన్నారు. బాధితు రాలికి న్యాయం జరిగేంత వరకు సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆవుల వీరన్న రజిని ఇమ్మడి పద్మ అర్చన ఫారినందుకు కృష్ణ చిరంజీవి వినయ్ రాజు అచ్చమ్మ వెంకటేష్ రాజేష్ ముత్తమ్మ వెంకన్న ఎల్లయ్య రాణి సరూప పద్మ శ్రీను మల్లేష్ పుష్ప రాజ్ తప్పెట్ల శ్రీకాంత్ జానీ శ్రీను గడ్డ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో గృహాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

~~రూ.8.50 లక్షలకే 512 చదరపు అడుగుల ఫ్లాట్..~~

లబ్ధిదారుడి వాటా రూ.3.50 లక్షలు.. ప్రభుత్వ సబ్సిడీ రూ.5 లక్షలు



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

వరంగల్ నగర పరిధిలో సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ అవకాశం కల్పిస్తోంది. గ్రేటర్ వరంగల్ పరిధిలోని కీర్తినగర్ హౌసింగ్ బోర్డు కాలనీ, గొర్రెకుంట గ్రామం, గీసుకొండ మండలంలో నిర్మించనున్న జీ+5 అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది.ఒక్కో ఫ్లాట్ 512 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉండగా, ధర రూ. 8.50 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో లబ్ధిదారుడి వాటా రూ. 3.50 లక్షలు కాగా, ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీ అందించనుంది. వార్షిక కుటుంబ ఆదాయం రూ. 6 లక్షలలోపు ఉండాలి. దరఖాస్తుదారులకు సొంత ఇల్లు లేదా ఫ్లాట్ ఉండకూడదు. ఆసక్తి, అర్హత కలిగిన వారు డిసెంబర్ 5, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

73 ఏళ్ల వృద్ధురాలికి క్యాన్సర్‌పై వైద్యుల పోరాటం..

ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ మధ్యే కీమోథెరపీ...

మల్టిపుల్ మైలోమా చికిత్సలో యశోదా వైద్యుల సమయస్ఫూర్తి

వీఆర్‌డీ లైట్ విధానంతో చికిత్స.. ప్రస్తుతం నిలకడగా రోగి ఆరోగ్యం



ప్రజా వాయిస్, మిర్యాలగూడ (నవంబర్ 21):

ఎముకల నొప్పి, రక్తహీనత, నిరంతర నీరసం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి కొన్నిసార్లు ప్రాణాంతక రక్త క్యాన్సర్ అయిన మల్టిపుల్ మైలోమాకు సంకేతాలు కావచ్చని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్గొండ జిల్లా వడపల్లికి చెందిన 73 ఏళ్ల వృద్ధురాలికి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ కీమోథెరపీ చికిత్సను కొనసాగించి ఆమె ఆరోగ్యాన్ని నిలకడగా ఉంచడంలో హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు విజయం సాధించారు. వృద్ధాప్యంతో పాటు బీపీ, టైప్-2 మధుమేహం, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెకు మల్టిపుల్ మైలోమా మూడో దశలో ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. హిమోగ్లోబిన్ 8.1 గ్రాములకు పడిపోవడంతో పాటు ఎముకల్లోనూ వ్యాధి ప్రభావం కనిపించింది. ఊపిరితిత్తుల సీటీ స్కాన్‌లో రెండు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ మచ్చలు, స్వల్పంగా నీరు ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ పరిస్థితుల్లో పల్మనాలజీ నిపుణుల సలహాతో ఇన్ఫెక్షన్‌కు చికిత్స అందిస్తూ, కీమోథెరపీని తట్టుకునే సామర్థ్యం ఉందో లేదో అవయవాల పనితీరును పరీక్షించారు. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో వీఆర్‌డీ లైట్ విధానంలో బోర్టెజోమిబ్, డెక్సామెథాసోన్ ఇంజెక్షన్లు, లెనాలిడోమైడ్ మాత్రలతో కీమోథెరపీ కొనసాగించారు. చికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో అవసరమైన మందులు అందించి డిశ్చార్జ్ చేశారు. తదుపరి కీమోథెరపీ డోసులతో పాటు రక్త పరీక్షల కోసం తిరిగి రావాలని సూచించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ రెడ్డి ఎల్ మాట్లాడుతూ.. వృద్ధుల్లో ఎముకల నొప్పి, రక్తహీనత, నిరంతర నీరసం, మూత్రపిండాల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, ఇవి మల్టిపుల్ మైలోమా లక్షణాలు కావచ్చని తెలిపారు. రోగి కుటుంబ సభ్యులకు వ్యాధి స్వభావం, చికిత్స విధానం, ఖర్చు, దుష్ప్రభావాలపై వివరించి వారి అంగీకారంతోనే చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ.. తమ ఆసుపత్రి అన్ని శాఖల్లోనూ అత్యాధునిక వైద్య సదుపాయాలతో క్లిష్టమైన వ్యాధులకు నిపుణుల ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వృద్ధులు ఎముకల నొప్పులు, నిరంతర నీరసం, మూత్రపిండాల సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

పేదలకు కొండంత అండ.. చామన్ పెల్లిలో నూతన పెన్షన్ పత్రాల పంపిణీ

మంజూరు పత్రాలు అందజేసిన సర్పంచ్ అయిట్ల లక్ష్మి సుదర్శన్



నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పెన్షన్లు కొండంత అండగా నిలుస్తున్నాయి.లక్ష్మణచాందా మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో శనివారం నూతనంగా మంజూరైన 16 పెన్షన్ మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు గ్రామ ప్రజాప్రతినిధులు,అధికారులు అందజేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొత్తం 16 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయి.ఇందులో 8 మంది వితంతువులు, 7 మంది దివ్యాంగులు (వికలాంగులు), ఒక ఒంటరి మహిళ ఉన్నారు. నెలనెలా అందే ఈ ఆర్థిక సాయం తమ కుటుంబ పోషణకు,మందులకు ఎంతగానో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ అయిట్ల లక్ష్మి సుదర్శన్,ఉప సర్పంచ్ గంగారెడ్డి,పంచాయతీ కార్యదర్శి గంగాసాగర్ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారుల చేతికి మంజూరు పత్రాలను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పెన్షన్ మంజూరు కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



నమ్మకాన్ని వమ్ము చేయను

అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కే. నాగేశ్వర రెడ్డి

ప్రజావాయిస్/వికారాబాద్:

తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర, పౌర రక్షణ ఓ శాఖ వికారాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మాదాపూర్ ఫైర్ స్టేషన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కే. నాగేశ్వర రెడ్డి ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కె. శ్రీనివాస్, టి. అమరేందర్, కార్యదర్శిగా ఎస్. చంద్రయ్య, కోశాధికారిగా ఏ. తిరుపతి రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కె. రవి, ఎం. రఘురాం రెడ్డి ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఎన్. కృష్ణారెడ్డి, ఏ. బిక్షపతి, కార్యవర్గ సభ్యులుగా పి. ఆంజనేయులు, ఆర్. శివనాయక్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేస్తుందని తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



లోకకల్యాణం కోసం మహా రుద్రాభిషేకం

ఈనెల 23న సాయిపుత్ర హోమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

ప్రజావాయిస్/తాండూరు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని లోకకల్యాణం కోసం తాండూరు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయిపుత్ర హోమ్స్ ఆధ్వర్యంలో సాయిపుత్ర హోమ్స్ అధినేత శంకర్ యాదవ్, ఆయన సతీమణి ఆధ్వర్యంలో ఈ మహా రుద్రాభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గోశాల ప్రతినిధులతో కలిసి శంకర్ యాదవ్ దంపతులు మహా రుద్రాభిషేకానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. లోకకల్యాణం,ప్రజల సుఖసంతోషాలు, శాంతి కోసం నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గోశాల గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షుడు వినోద్ కుమార్ జైన్, కోశాధికారి పటేల్ విజయ్ కుమార్, సభ్యులు ఓం ప్రకాష్ సోమాని, బాలాజీ వెంకట్, సాయిపుత్ర సేవా సమితి సేవా సభ్యులు పాల్గొన్నారు.



గోపాల్ దీన్నే గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభించిన సర్పంచ్ దొడ్ల కవిత

కుటుంబంలో ఒక్కరే అనే కాకుండా అందరికీ వర్తించే విధంగా చేయాలీ : సర్పంచ్ దొడ్ల కవిత

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

వీపనగండ్ల మండల పరిధిలోనిగోపాల్ దీన్నే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రారంభించిన గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత, ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామ కార్యదర్శి కర్ణాకర్ గ్రామపంచాయతీ సభ్యుల ఆధ్వర్యంలో బీమా పథకాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత మాట్లాడుతూరేషన్ కార్డు ఆధారంగా భీమ ఇవ్వడం మంచిదని, కానీ కుటుంబంలో ఒకరికే కాకుండా అందరికీ వర్తించే విధంగా చేయాలని, కొంతమందికి రేషన్ కార్డులు లేని వారు ఉన్నారు వారికి కూడా భీమ వర్తింప చేయాలని వారన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ గ్రామపంచాయతీలో నమోదు చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత, ఉప సర్పంచ్ వెంకటయ్య, కార్యదర్శి కర్ణాకర్, వార్డు మెంబర్స్ కురుమయ్య, చంద్రయ్య, బక్కన్న, లలితమ్మ,పద్మ, గ్రామపంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాహనదారులకు రైతులు ఇబ్బందులు కలిగించకండి

మీ ధాన్యం మీకు ముఖ్యం
కానీ ప్రతి మనిషి ప్రాణం అంతకంటే ముఖ్యం
ఒక్క నిమిషం నిర్లక్ష్యం- ఒక నిండు ప్రాణానికి ప్రమాదం !
ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి
వీపనగండ్ల ఎస్సై నరేష్ కుమార్

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

మీ భద్రత మా బాధ్యత రోడ్డు భద్రత మనందరిదీ బాధ్యత అని వీపనగండ్ల స్థానిక ఎస్సై నరేష్ కుమార్ అన్నారు.ప్రస్తుతం వరి ధాన్యం కోతల సీజన్‌లో రైతులు రహదారులపై వరి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు ఈ విధంగా రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది ముఖ్యంగా రాత్రి సమయాల్లో రోడ్లపై ధాన్యం కుప్పలు, రాళ్లు, కట్టెలు, సరైన హెచ్చరికలు లేని ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఎస్ఐ నరేష్ కుమార్ అన్నారు.రైతులు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు రహదారులపై వరి ధాన్యాన్ని ఆరబెట్టడం పూర్తిగా నివారించండి. ప్రత్యామ్నాయంగా కల్లాలు, ఖాళీ స్థలాలను వినియోగించండి.రోడ్లపై రాళ్లు, కట్టెలు, ఇతర వస్తువులను అడ్డుగా పెట్టవద్దు.రాత్రి సమయంలో రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టడం లేదా నిల్వ ఉంచడం చేయవద్దు.తప్పనిసరి పరిస్థితుల్లో రహదారి పక్కన పనులు చేపడితే వాహనదారులకు స్పష్టంగా కనిపించే రిఫ్లెక్టివ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి అని ఎస్ఐ వివరించారు.రహదారిపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దు.ధాన్యం ఆరబెట్టిన వెంటనే రహదారిని పూర్తిగా శుభ్రం చేసి వాహనాల రాకపోకలకు అందుబాటులో ఉంచండి.

ఒక్క నిమిషం నిర్లక్ష్యం – ఒక నిండు ప్రాణానికి ప్రమాదం!

మీ ధాన్యం మీకు ముఖ్యం... కానీ ప్రతి మనిషి ప్రాణం అంతకంటే ముఖ్యం.

రైతు సోదరులు పోలీస్ శాఖ సూచనలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించగలరని ఎస్సై నరేష్ కుమార్ కోరారు.



కల్వకోల్‌లో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు

పండుగల సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి
కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చిన మత్స్యకారులు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకోల్ గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు పండుగల సాయన్న విగ్రహావిష్కరణకి భారీ బహిరంగ సభకు వీపనగండ్ల మండల కేంద్రం నుండి ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం మండల నాయకులు భారీగా బయలుదేరారు.ఈ సందర్భంగా కల్వకోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పండుగల సాయన్న విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్, బిత్తిరి సత్తి తదితరులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి కొల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మత్స్యకారులు పెద్ద సంఖ్యలో



తరలివచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ,,, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.మత్స్యకారుల అభ్యున్నతి, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పండుగల సాయన్న వంటి నాయకుల విగ్రహాల ఏర్పాటు ద్వారా వారి సేవలను, త్యాగాలను భవిష్యత్ తరాలకు



తెలియజేయవచ్చని అన్నారు. మత్స్యకారులు ఐక్యంగా ఉంటూ తమ హక్కుల సాధనతో పాటు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.అలాగే ఈ మత్స్యకారుల సంక్షేమం, వారి అభివృద్ధి, హక్కులు, జీవనోపాధికి సంబంధించిన అంశాలపై సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ 59,వజన్మదిన సందర్భంగా మండల కేంద్రంలో స్వేరోస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ఉచిత మెగా వైద్య శిబిర కరపత్రాలు విడుదల చేసిన సర్పంచ్ మీసాల పార్వతమ్మ, ఉప సర్పంచ్ మధుగని బాలపీర్
ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. స్వేరోస్ నాయకులు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాజీ ఐపీఎస్, అడిషనల్ డీజీపీ (రిటైర్డ్) 59వ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 23న ప్రతిజ్ఞ దివస్ సందర్భంగా వీపనగండ్ల మండల స్వేరోస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ, ఉప సర్పంచ్ మధుగని బాలపీర్, కోరారు.ఈ సందర్భంగా శుక్రవారం సర్పంచ్ మీసాల పార్వతమ్మ, ఉప సర్పంచ్ మధుగని బాలపీర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. వీపనగండ్ల గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలు రామకృష్ణ, దయ్యపు కురుమయ్య, దయ్యపు రాము తెలిపారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు అందించనున్నారు.వైద్య శిబిరంలో అందుబాటులో ఉండే పరీక్షలు:

2డీ ఎకో పరీక్ష
ఈసీజీ పరీక్ష
బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) పరీక్ష
ఎత్తు, బరువు కొలతలు
ఆక్సిజన్ శాతం (ఎస్ పి ఓ 2) పరీక్ష
రక్తపోటు (బీపీ) పరీక్ష
రక్తంలో చక్కెర స్థాయి (షుగర్) పరీక్ష

ఈ శిబిరం ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని ప్రాథమికంగా తెలుసుకోవడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలను



చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.అలాగే వీపనగండ్ల మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కావలి మహేష్, బీఆర్ఎస్ నాయకులు జల్లు నారాయణ, మంగదొడ్డి శేఖర్, పామ్ నాగులు, సూర్యనారాయణ, మిద్దె శ్రీను, జానకి రాముడు, నరేష్, హరీష్, రామకృష్ణ, సాయి, విలేకర్ రాముడు, రవి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. బంగారు భవిష్యత్తును నిర్మించుకోండి

షాద్‌నగర్ సీఐ సీతారాం

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ప్రజా వాయిస్ షాద్‌నగర్)

విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలని షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం సూచించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని ఆయన హెచ్చరించారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ సీఐ సీతారాం హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీఐ సీతారాం మాట్లాడుతూ.. కొంతమంది విద్యార్థులు స్నేహితుల ప్రభావం, ఫ్యాషన్ పేరుతో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తమ స్నేహితుల్లో ఎవరైనా డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇవ్వడానికి భయపడాల్సిన అవసరం లేదని, 112 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను



గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.డ్రగ్స్, గంజాయి కలిగి ఉండటం, వినియోగించడం, విక్రయించడం వంటి నేరాలకు పాల్పడితే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర తీవ్రతను బట్టి దీర్ఘకాలిక జైలు శిక్షలు పడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్‌తో పాటు పోలీసులు మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి ప్రస్తుత డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిన నేపథ్యంలో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని వివరించారు.తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని, మిమ్మల్ని అరెస్ట్ చేస్తామని, సీబీఐ విచారణ జరుగుతోందని బెదిరిస్తూ వచ్చే నకిలీ ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.మహిళలకు షీ టీమ్స్ అండగా ఉంటాయి మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా షీ టీమ్స్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకుండా విద్యాభ్యాసంపైనే పూర్తి దృష్టి పెట్టాలని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సైబర్ వారియర్ శ్రీనివాస్, రాజు అనిల్, షాద్‌నగర్ షీ టీమ్ సభ్యులు, ఎస్సై ధర్మియా రాథోడ్, పీసీ రేష్మ, గీత, మోటివేషన్ స్పీకర్ మహేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్, టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, రామ్ చరణ్, శివ గౌడ్, వంశీ, తరుణ్, కార్తీక్, విష్ణువర్ధన్, చంద్రకాంత్ రెడ్డి, అబ్దుల్, సాయి గౌడ్, రాహుల్, శివ, సాయి, బబ్లు, బన్నీ, యశ్వంత్, అశ్విక్ తదితరులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప

మాచనపల్లి గ్రామంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి

(ప్రజా వాయిస్ షాబాద్)

షాబాద్ మండలంలోని మాచనపల్లి గ్రామంలో గిరీష్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి హాజరై అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు దీక్షా నియమాలను పాటిస్తూ స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గురుస్వామి రవీందర్ గౌడ్, మండలానికి చెందిన అయ్యప్ప స్వాములు, మాచనపల్లి మాజీ సర్పంచ్ పట్లోళ్ల మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎండిన చెరువులతో మత్స్యకారుల జీవనోపాధికి దెబ్బ

కుటుంబానికి 10 వేల ఆర్థిక సాయం అందించాలి

ప్రజా వాయిస్ మహబూబాబాద్

ప్రపంచ మత్స్యకార దినోత్సవము కలెక్టరేట్ లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి మత్స్య శాఖ ఇన్స్పెక్టర్ దామెర శ్రీనివాస్ అధ్యక్షత వహించగా మత్స్యకార దినోత్సవ ప్రాముఖ్యతను గూర్చి వివరించడము జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఏలినినో ప్రభావంతో చెరువులు అన్ని ఎండి పోయినందున మత్స్యకారుల జీవన విధానంపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 10,000 ఆర్థిక సాయం అందజేయాలని వారు కోరారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారునికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి. ప్రభుత్వం మత్యకారుల కొరకు ఉచిత చేప పిల్లల పంపిణీలో భాగంగా నగదు బదులు చేసి మత్యకార్లకు ప్రత్యక్షంగా సాయం చేయాలని వారు కోరారు. మత్స్య కారులకు తక్కువ విస్తీర్ణంలో ఉన్నటువంటి వారి యొక్క స్థలంలో చేపల చెరువులకు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్, మాట్లాడుతూ జిల్లాలో 10 ఎకరాల విస్తీర్ణంతో ఉన్నటువంటి స్థలాన్ని మత్స్యశాఖ అప్పగించి అధునాతన ఫిష్ కల్చర్ ని ఏర్పాటు చేయాలని మత్స్యకారుల జీవనోపాధిగా కల్పించే విధంగా నూతన ప్రమాణాలు ప్రవేశపెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు చిల్లా సహదేవ్ ముదిరాజ్ ఈ సమావేశంలో పిట్టల ధనుంజయ.పెద్ది సైదులు పిడుగు వెంకన్న, నగేష్, బాసణబోయిన ఎంకన్న, సైదులు మరియు వివిధ మండలాల మత్స్యకారులు పాల్గొన్నారు.



67 ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.67.07 లక్షల చెక్కుల పంపిణీ

ప్రజావాయిస్/పెద్దేముల్:

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 67 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.67,07,772 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు దారాసింగ్ నాయక్, డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండపురం గోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లోంక నర్సింలు, ఎఫ్‌సీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, కొట్పల్లి ఏఎంసీ చైర్మన్ అనిత రమేష్, వైస్ చైర్మన్ మధులత శ్రీనివాస్, సర్పంచ్ డీవై చిన్న నర్సింలు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ డీవై పెద్ద నర్సింలు, టీపీసీసీ మైనారిటీ మాజీ కన్వీనర్ రియాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెర్కపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు జీవిత బీమా కల్పించడమే లక్ష్యం



ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని పెర్కపల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఈరోజు ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు జీవిత బీమా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని గ్రామస్థాయిలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జరుపుల సాయికిరణ్ మాట్లాడుతూ, కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా జీవిత బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జరుపుల సాయికిరణ్, బట్వాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు బోలిశెట్టి సుధాకర్, అచ్చే స్వామి, చిలుముల వెంకటస్వామి, ఇస్లావత్ చెందు, కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ సందేలా మల్లేష్, దొరిశెట్టి రాజయ్య, సింగతి పటేల్ ప్రభాకర్, సింగతి బీమయ్య, సింగతి అర్జయ్య, ముత్తే కొమురయ్య, అఖిరెడ్డి కొమురయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జాతీయ, రాష్ట్ర కమిటీలకు ఎన్నికైన జర్నలిస్టులకు ఘన సన్మానం..

అంకరి ప్రకాష్, పినగాని శ్రవణ్ కుమార్‌లకు సహచరుల అభినందనలు

ప్రజా వాయిస్ మంథని

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మరోసారి ఎన్నికైన నమస్తే తెలంగాణ పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అంకరి ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన మంథని 10 టీవీ ప్రతినిధి పినగాని శ్రవణ్ కుమార్‌లను శనివారం మంథని డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జంజర్ల శంకర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నూతన బాధ్యతలు చేపట్టిన వారు మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అంకరి ప్రకాష్, పినగాని శ్రవణ్ కుమార్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మాచిడి కిరణ్ గౌడ్, కార్యదర్శి బండ లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుడు చిట్టిమెల్ల సంతోష్, పెరుగు రాకేష్, బండారి సురేష్, తంబూరి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆంగ్ల ప్రతిభకు వేదికగా ఒలింపియాడ్, టెడ్ టాక్ పోటీలు..

- మంథని బాలికల ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీపీ ఆధ్వర్యంలో పోటీలు

- జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక

ప్రజా వాయిస్ మంథని

విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు, వక్తృత్వ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో మంథని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఒలింపియాడ్, టెడ్ టాక్ ప్రతిభా పోటీలు నిర్వహించారు. మంథని మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన జూనియర్, సీనియర్ విభాగాల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జూనియర్ విభాగం ఒలింపియాడ్‌లో మంథని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన కె. విశ్వ ప్రణీత్ ప్రథమ స్థానం సాధించగా, టెడ్ టాక్ విభాగంలో అదే పాఠశాలకు చెందిన ఆర్. స్నేహిత్ విజేతగా నిలిచారు. సీనియర్ విభాగం ఒలింపియాడ్‌లో ఎక్లాస్‌పూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన నిత్యశ్రీ, టెడ్ టాక్ విభాగంలో మంథని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన డి. సాయి దివ్యమనస్విని ప్రథమ స్థానాలు సాధించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు డిసెంబర్‌లో పెద్దపల్లిలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. సుమలత విజేతలను అభినందించి, జిల్లా స్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు జి. శేషాది, ఎస్. ఉమామహేష్, జె. సావిత్రితో పాటు మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు

- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- మంబాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజావాయిస్/తాండూరు:

రైతులకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్వింటాల్ ధాన్యానికి రూ.2,461 మద్దతు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లోంక నర్సిములు, పెద్దేముల్ ఎఫ్‌సీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత రమేష్ నాయక్, వైస్ చైర్మన్ మదులత శ్రీనివాస్ చారి, మంబాపూర్ సర్పంచ్ భార్గవి శ్రీనివాస్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాయిని నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండల స్థాయి చెకుముకి పోటీలు

జిల్లా స్థాయి పోటీలకు విజేతల ఎంపిక

పాల్గొన్న 8, 9, 10 తరగతుల విద్యార్థులు

ప్రజా వాయిస్, కోరుట్ల:

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌ల నుంచి 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపిస్తామని కోఆర్డినేటర్ చిరంజీవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.గంగాధర్, మార్గం రాజేంద్రప్రసాద్, సదాశివ్, సీఆర్పీ పి.గంగాధర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రూ.400 కోట్ల భూములపై వివాదం

కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

కొత్వాల్‌గూడ సర్వే నంబర్ 626/1లో ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణలు

ఇప్పటికే కొంత భూమి కబ్జాకు గురైందని కొనమొల్ల శ్రీనివాస్ వెల్లడి

ప్రజా వాయిస్॥శంషాబాద్:

జీహెచ్ఎంసీ పరిధిలోని కొత్వాల్‌గూడ 119వ డివిజన్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారం తెరపైకి వచ్చింది.సర్వే నంబర్ 626/1లో ఉన్న ప్రభుత్వ, హెచ్ఎండీఏ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ 119వ డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆరోపించారు.సుమారు రూ.400 కోట్ల విలువైన భూములను పరిరక్షించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొనమొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొత్వాల్‌గూడ పరిధిలో విలువైన ప్రభుత్వ భూములను కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే కొంత భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు.ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కోరారు.ఆక్రమణలకు గురైన భూములను గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో పాటు మిగిలిన భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూముల రికార్డులు,క్షేత్రస్థాయి పరిస్థితులను సమన్వయంతో పరిశీలించి ఆక్రమణల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షులు మురళి గౌడ్, హరికృష్ణ,గూడెపు అశోక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్,యూత్ అధ్యక్షుడు జి.వి.పి.సాగర్, దీపక్ గౌడ్,బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శివ,శ్యామ్, సోషల్ మీడియా ప్రతినిధి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పీపీపీ యూనిట్, ఔట్‌రీచ్ ఇమ్యునైజేషన్ సెషన్

కిశోర బాలబాలికల ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్

ప్రజావాయిస్ రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సిరిసిల్లలోని పీపీపీ యూనిట్‌ను సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న ఔట్‌రీచ్ ఇమ్యునైజేషన్ (టీకాల కార్యక్రమం) సెషన్‌ను పరిశీలించారు ఈ సందర్భంగా టీకాల పంపిణీ, చిన్నారులకు అందిస్తున్న వ్యాక్సినేషన్ సేవలు, కార్యక్రమ నిర్వహణ తీరును పర్యవేక్షించారు అర్హులైన ప్రతి చిన్నారికి సకాలంలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.అనంతరం సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని కిశోర బాలబాలికల స్నేహపూర్వక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు ఈ కేంద్రం ద్వారా కిశోర బాలబాలికలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్ సేవలను పరిశీలించారు కిశోర బాలబాలికలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందిస్తూ, వారి ఆరోగ్య సమస్యలపై తగిన అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సంపత్ కుమార్, విసిసిఎం,నవీన్, సూపర్‌వైజర్ పద్మజ, ఏఎన్ఎం భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు

ప్రజా వాయిస్, కోరుట్ల:

పేద, మధ్యతరగతి కుటుంబాల సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు అన్నారు. శనివారం కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన 80 మంది, కోరుట్ల మండల పరిధిలోని 127 మంది లబ్ధిదారులకు ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల చిరకాల స్వప్నం నెరవేరుతోందని, ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల మండల ఎంపీడీఓ, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, వివిధ గ్రామాల సర్పంచులు, కోరుట్ల పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



శాతవాహన యూనివర్సిటీ గోల్డ్ మెడల్‌కు కోరుట్ల విద్యార్థిని ఎంపిక

ఎంఎస్సీ మ్యాథమెటిక్స్‌లో అత్యధిక మార్కులు సాధించిన పల్లికొండ పావని

డిసెంబర్‌లో గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం ప్రదానం

అభినందించిన రామకృష్ణ కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం

ప్రజా వాయిస్, కోరుట్ల:

శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన బంగారు పతకానికి (గోల్డ్ మెడల్) కోరుట్ల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థిని పల్లికొండ పావని ఎంపికయ్యారు. పీజీ ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ విభాగంలో యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఆమెకు ఈ అరుదైన గౌరవం దక్కింది.డిసెంబర్ నెలలో జరగనున్న శాతవాహన యూనివర్సిటీ మూడవ స్నాతకోత్సవ వేడుకలలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పావని ఈ గోల్డ్ మెడల్‌ను అందుకోనున్నారు. యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి కళాశాలకు, పట్టణానికి పేరు తీసుకువచ్చిన పావనిని కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, డైరెక్టర్ గాడిపెల్లి హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ మరియు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. విష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కుటుంబ పెద్దకు రక్షణ....ఆ ఇంటికి ఆర్థిక భరోసా

ప్రతి అర్హత గల కుటుంబానికి బీమా రక్షణే లక్ష్యం

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ప్రజా వాయిస్॥ రాజేంద్రనగర్:

కుటుంబానికి జీవనాధారమైన పెద్దను కోల్పోతే ఆ ఇంటి ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం కాకూడదు,ఆపద సమయంలో బాధిత కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడకూడదు,అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అత్తాపూర్ సర్కిల్ హైదర్‌గూడ డివిజన్



పరిధిలోని ఉప్పరపల్లి రెడ్డి సంఘం భవనంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ బీమా పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు.ఆపద సమయంలో బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడంలో ఈ పథకం కీలకంగా నిలుస్తుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో నమోదు చేసుకుని ప్రభుత్వ బీమా రక్షణను పొందాలని సూచించారు.జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఎ. సదాలక్ష్మి,అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లోకపెద్ద మల్లారెడ్డి,కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి, అధికారులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్‌కు అడ్డుపడుతున్నది ఎవరు?

ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్‌పై గోమాస సచిన్ తీవ్ర ఆరోపణలు

కార్పొరేషన్ ప్రకటించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతాం

బెల్లంపల్లి/ ప్రజా వాయిస్

నేతకాని సమాజానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిపై యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, నేతకాని మహర్ సంఘం జాతీయ యూత్ విభాగం అధ్యక్షుడు గోమాస సచిన్ తీవ్ర ఆరోపణలు చేశారు., శనివారం బెల్లంపల్లిలో నేతకాని సంఘం నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్



ఏర్పాటుకు ముందుకు వస్తున్నప్పటికీ ఎంపీ, మంత్రి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధికి దూరంగా ఉన్న నేతకాని సమాజానికి అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే అన్యాయం చేయడం బాధాకరమన్నారు,పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మూడు లక్షలకు పైగా నేతకాని జనాభా ఉన్నప్పటికీ తగిన రాజకీయ ప్రాతినిధ్యం, అభివృద్ధి అవకాశాలు దక్కడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం నేతకాని సమాజాన్ని నిర్లక్ష్యం చేయడమేనని విమర్శించారు, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, అడ్డూరి లక్ష్మణ్ కార్పొరేషన్ ఏర్పాటుకు లేఖలు రాసినప్పటికీ ఎంపీ, మంత్రి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా జీవో నంబర్ 2 ద్వారా మాల కార్పొరేషన్‌లో ఉపకులంగా చేర్చడం నేతకాని సమాజాన్ని అణచివేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ప్రత్యేక నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని గోమాస సచిన్ హెచ్చరించారు,ఈ సమావేశంలో నేతకాని మహర్ సంఘం నాయకులు గట్టు బానేష్, గట్టు శివలింగం, రవికుమార్, దుర్గం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి..
ప్రతి నెలా రెండుసార్లు దరఖాస్తులు, చెక్కుల పంపిణీ...

దళారులను ఆశ్రయించవద్దు.. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందండి..

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం..

120 మంది లబ్ధిదారులకు రూ.65.25 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని...

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా నిరంతరం సేవలందిస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శనివారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సుమారు 120 మంది లబ్ధిదారులకు రూ.65 లక్షల 25 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు ఎవరూ దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, మధ్యవర్తులకు వందలు, ఐదువందలు, వేల రూపాయలు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లేదా



తమ తమ డివిజన్లలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా దరఖాస్తు చేసుకుంటే, వాటిని స్వయంగా పరిశీలించి హైదరాబాద్‌కు తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరు చేయించే బాధ్యత తాము తీసుకుంటున్నామని తెలిపారు.ప్రతి నెలా రెండుసార్లు సీఎం సహాయ నిధి చెక్కులను తీసుకొచ్చి లబ్ధిదారులకు అందిస్తున్నామని, లబ్ధిదారులు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా వారి ఇళ్ల వద్దకే చెక్కులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఆయా డివిజన్ల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుల ద్వారా లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరవేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 2,700 మందికి చేయూత ఆసరా పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, ప్రతి డివిజన్‌కు సగటున 110 మంది చొప్పున కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు అందించామని వివరించారు.అదేవిధంగా నియోజకవర్గంలో సుమారు 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందిస్తున్నామని.గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు కొందరికే పరిమితమయ్యాయని, పేదలకు శాశ్వత ప్రయోజనం కలిగించేలా కార్యక్రమాలు అమలు చేయలేకపోయారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా కేవలం అర్హత, అవసరమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.ప్రజలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు వారి ఇళ్ల వద్దకే చేరాలన్నదే తమ ప్రభుత్వ విధానమని పేర్కొంటూ, ప్రజలకు ఏ అవసరం వచ్చినా 24 గంటలూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎం సహాయ నిధి ఒక్కటే కాకుండా పేదలకు ఉపయోగపడే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన వారి వద్దకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చే తాత్కాలిక ప్రలోభాలకు, డబ్బులకు తమ భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఐదొందలు, వెయ్యి, రెండువేల రూపాయల ప్రలోభాల కంటే ప్రజలకు దీర్ఘకాలికంగా మేలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసే ప్రభుత్వాలను ఆదరించాలని కోరారు.ప్రజల కష్టాల్లో తోడుగా నిలవడం, అర్హులకు ప్రభుత్వ సహాయం అందించడం, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడం తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేంద్ర రైతు వ్యతిరేక విధానాలపై
నవంబర్ 26న జరిగే నిరసనలను జయప్రదం చేయండి

రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలి

కొండు బానేష్, లాల్ కుమార్ పిలుపు

ప్రజా వాయిస్ .మంచిర్యాల

ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న మంచిర్యాల జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి కొండు బానేష్, రైతు సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు లాల్ కుమార్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్క్ భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలకు పైగా గడుస్తున్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీ తన మేనిఫెస్టోలో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని ఆరోపించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రైతాంగాన్ని కార్పొరేట్ సంస్థల దోపిడీకి గురిచేసే విధంగా ఉన్నాయని దేశవ్యాప్తంగా రైతులు గుర్తించి 13 నెలల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక ఉద్యమం నిర్వహించారని తెలిపారు. రైతుల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తూ రైతులకు క్షమాపణ చెప్పిందని, 2021 డిసెంబర్ 9న రైతులకు ఇచ్చిన హామీలను మాత్రం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. రద్దు చేసిన వ్యవసాయ చట్టాల స్థానంలో కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా మార్కెట్ చట్టాన్ని తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రైతుల సంక్షేమం వంటి కీలక అంశాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, మంచిర్యాల జిల్లాలో కూడా కరువు ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు. తక్కువ వర్షపాతం నమోదవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పటికీ పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంట నష్టాలతో రైతాంగం ఆర్థికంగా కుదేలవుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలపై వడ్డీ మాఫీ చేయడం లేదని, పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు అందడం లేదని తెలిపారు. కరువు కారణంగా రైతులు అనేక సమస్యలతో



కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 9న రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలో నెలకొన్న శాశ్వత సాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని కోరారు.ఈ నేపథ్యంలో నవంబర్ 26న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందారపు రాజేష్, రైతు సంఘం ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పుల్గర్‌చర్ల గ్రామంలో లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకనీ ప్రారంభించిన సర్పంచ్ బత్తుల బాలరాజ్

అర్హులైన ప్రతి ఒక్కరు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియం చేసుకోవాలి

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సిద్దిపేట బహిరంగ సభ వేదికగా ప్రకటించిన ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని శనివారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం, పుల్గర్‌చర్ల గ్రామంలో ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బత్తుల బాలరాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తుల గోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో దరఖాస్తుల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయితీ సెక్రెటరీ జి.రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్ద ఈ పథకానికి సంబంధించిన



దరఖాస్తులను ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి జిరాక్స్ ప్రతులు, ఇతర ధ్రువపత్రాలు అవసరం లేదని, కేవలం రేషన్ కార్డు నంబరు, సెల్‌ఫోన్ నంబరు, ఇంటి నంబరు ఉంటే సరిపోతుందని వివరించారు. ఎలాంటి కాగితపు పనులు లేకుండా పూర్తిగా అంతర్జాలం ద్వారా దరఖాస్తు నమోదు చేస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన అనంతరం కుటుంబ బీమా గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవడంతో పాటు, దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సందేశం రూపంలో బీమా గుర్తింపు సంఖ్య అందుతుందని తెలిపారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల అర్హులకు ఈ పథకం వర్తిస్తుందని, ప్రతి కుటుంబం నుంచి ఒకరికి జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన 20 రోజుల గడువులోగా అర్హులైన వారు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురుకుల మదిలేటి, మాజీ ఉప సర్పంచ్ నరేష్ కుమార్, వార్డు సభ్యులు పింజారి సుభాష్, ఆలకుంట చిన్న పద్మమ్మ, బిజ్జ కళావతమ్మ, పార్టీ కార్యకర్తలు నరేష్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఐపీఎస్ విద్యార్థిని గీతాశ్రీ

విద్యార్థినిని అభినందించిన పాఠశాల చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్ కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం. గీతాశ్రీ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 20న సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 22 నుంచి 24 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నారు.విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేస్తూ గీతాశ్రీని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం,శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

ప్రొఫెసర్ కాశీనాథ్

ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల స్థాయి పరీక్ష శనివారం ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కన్వీనర్ బమ్మెర సోమయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుల్ల నిర్మల కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిట్ ఆచార్యులు ప్రొఫెసర్ కాశీనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వం, హేతుబద్ధ ఆలోచన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని అన్నారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ, ఆధారాలతో ఆలోచించే అలవాటు



పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు మాట్లాడుతూ సమాజంలో నెలకొని ఉన్న మూఢనమ్మకాలను తొలగించడంలో జన విజ్ఞాన వేదిక నిబద్ధతతో పనిచేస్తోందని, సైన్స్ టాలెంట్ టెస్ట్‌తో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రయోగాత్మక నైపుణ్యాలు, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే వివిధ కార్యక్రమాలను చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలల విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతుల పుస్తకాలు ప్రధానం చేశారు . ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అక్కంపేట, రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల, ప్రైవేట్ పాఠశాల విభాగంలో సెయింట్ థెరిసా ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఈనెల 28న జిల్లాస్థాయిలో జరిగే పరీక్షకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు బమ్మెర సోమయ్య, ఐతరాజు, శేఖర్, రవి, రమేష్, లావణ్య, పుష్ప, స్వప్న మాధురి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు మండల కోశాధికారి ఆర్వం పరమయ్య

ప్రజా వాయిస్ ఆత్మకూర్



అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి ఆర్వం పరమయ్య పిలుపునిచ్చారు నీరుకుల్లా గ్రామపంచాయతీ ఆవరణంలో జరిగిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమంలో పరామయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామానికి ప్రజలు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా విధిగా చేయించుకోవాలని దీని ద్వారా మీ కుటుంబానికి ప్రమాదవశాత్తు ఏమైనా జరిగినచో జీవిత భీమా ద్వారా ఐదు లక్షల రూపాయలు బాధ్యత కుటుంబానికి ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబ సభ్యులు గ్రామ కార్యదర్శి ద్వారా బీమా నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో , గ్రామ పార్టీ అధ్యక్షులు అన్నదాత కుమార్ స్వామి, ఉడుత శ్రీనివాస్, పసుల లక్ష్మీనారాయణ, పావుశెట్టి శివకుమార్, ఉప్పునూతల కోటి తదితలందరూ పాల్గొన్నారు.

అభివృద్ధికి మరో ముందడుగు!

రూ.30 కోట్లతో పెద్ద చెరువు అభివృద్ధి..

కాలనీలలో పార్కులు, భూగర్భ డ్రైనేజీ పనులకు హామీ

జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతిపత్రం అందజేసిన మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

బోడుప్పల్ / ప్రజా వాయిస్ :

మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ,మేడిపల్లి, పర్వతాపూర్ ప్రాంతాల్లోని 9,10వ డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో మాజీ ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు ముందడుగు వేశారు. ఈ మేరకు మాజీ మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ మేయర్, మాజీ కార్పొరేటర్లు,మాజీ కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, వివిధ కాలనీల అధ్యక్షులు జోనల్



కమిషనర్ రాధిక గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆమెతో చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రాధిక గుప్తా సానుకూలంగా స్పందించి పలు అభివృద్ధి పనులపై హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ప్రధాన అభివృద్ధి పనులు..... పీర్జాదిగూడ పెద్ద చెరువు అభివృద్ధి కోసం సుమారు రూ.30 కోట్లతో పనులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి కాలనీలో పార్కుల అభివృద్ధి, నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పర్వతాపూర్ పోచమ్మకుంట చెరువు, పీర్జాదిగూడ పుల్చేరుకుంట చెరువుల సుందరీకరణతో పాటు బండ్ ఫార్మింగ్ పనులను గ్రీన్ బడ్జెట్ కింద తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అవసరమైన కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పిట్టల మల్లేష్, బచ్చ రాజు, అసంతరెడ్డి, పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి,స్వాతి కృష్ణ గౌడ్,చంద్రకళ చంద్రారెడ్డి,జగదీష్ రెడ్డి, కే. వెంకటేష్ గౌడ్, రమణారెడ్డితో పాటు పలువురు నాయకులు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సవాలును స్వీకరించారు.. సురక్షిత ప్రసవం చేశారు

పెద్దాసుపత్రులకు దీటుగా.. పాల్వంచ సి.హెచ్.సి,లోనే విజయవంతమైన హై రిస్క్ ప్రసవం!

క్షేమంగా తల్లీబిడ్డ క్షేమం..!!

వైద్య బృందానికి డి.సి.హెచ్ ఎస్, అభినందనలు

ప్రజా వాయిస్ పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వైద్యులు సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యంతో అరుదైన వైద్య విజయాన్ని సాధించారు. పలు ఆరోగ్య సమస్యలతో కూడిన హై రిస్క్ గర్భిణికి అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తల్లీబిడ్డ ఇద్దరినీ క్షేమంగా కాపాడారు.వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచ మండలానికి చెందిన 25 ఏళ్ల శిరీష మొదటి కాన్పు కోసం, పాల్వంచలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో కి వచ్చింది.ఆమెకు థైరాయిడ్ సమస్య, గర్భధారణ సమయంలో రక్తపోటు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండటం వంటి సమస్యలతో పాటు 115 కిలోల అధిక శరీర బరువు కూడా ఉంది. అంతేకాకుండా కడుపులోని శిశువు కూడా అధిక బరువుతో ఉండటంతో వైద్యులు ఈ కేసును హై రిస్క్‌గా గుర్తించారు. సాధారణంగా ఇలాంటి క్లిష్టమైన కేసులను మెరుగైన వైద్య సదుపాయాలున్న పెద్ద ఆసుపత్రులకు తరలిస్తుంటారు. అయితే ఈ కేసును పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో లోనే నిర్వహించేందుకు ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యుడు డాక్టర్ పి. రాంప్రసాద్ ప్రత్యేక చొరవ చూపారు. కేసులోని ప్రమాదాలను అంచనా వేసి, పరస్పర సమన్వయంతో బాధ్యతగా ముందడుగు వేసి ఈ సవాలును స్వీకరించారు. అవసరమైన వైద్య ఏర్పాట్లతో తమ వైద్య బృందంతో కలిసి విజయవంతంగా అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించారు.వారి సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యం, సమన్వయంతో 3.25 కిలోల బరువున్న ఆడ శిశువు సురక్షితంగా జన్మించింది. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ



ఆరోగ్యంగా ఉన్నారు.సాధారణంగా ఉన్నతస్థాయి ఆసుపత్రులకు పంపించే ఇలాంటి క్లిష్టమైన కేసును స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో లో స్వీకరించి, విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యుడు డాక్టర్ పి. రాంప్రసాద్‌తో పాటు మొత్తం వైద్య బృందాన్ని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరావు ప్రత్యేకంగా అభినందించారు. పెద్దాసుపత్రులకు దీటుగా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వంటి చిన్న ఆసుపత్రులలో సైతం నాణ్యమైన ప్రసూతి వైద్యం, అత్యవసర శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మాకు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి అంటే నమ్మకం .. అందుకే ఇక్కడ ప్రసవం- కుటుంబ సభ్యులు..



మా కుటుంబం లో చాలా మంది పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం జరిగిందనీ, కోవిడ్ సమయంలో సైతం ఇక్కడే మా కుటుంబ సభ్యుల కు కాన్పు సురక్షితంగా చేశారని. అందుకే రక్తపోటు , మధుమేహం , అధిక బరువు, మొదలగు సమస్యలు ఉన్న కూడా నమ్మకం తో వచ్చామని, మా నమ్మకాన్ని వమ్ము కాకుండా వైద్యులు సురక్షిత ప్రసవం చేశారని భర్త శశి కాంత్ తెలిపారు. 20 ఏళ్ల క్రితం తను కూడా ఇక్కడే ప్రసవం చేపించుకున్నానని, ఇప్పుడు తన కూతురు సైతం పాల్వంచ ఆసుపత్రిలో ప్రసవం జరగడం ఆనందంగా ఉందని,ఆసుపత్రి వైద్యులకి, సిబ్బందికి మా కుటుంబం రుణపడి ఉంటామని శిరీష తల్లి భాగ్యమ్మ తెలిపారు.



అర్హులందరికీ ఇందిరమ్మ కుటుంబ భరోసా అందాలి..

- 5వ వార్డులో ప్రత్యేక నమోదు క్యాంపు..

- లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

ప్రజా వాయిస్ మంథని

మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్లి 5వ వార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా భరోసా పథకంపై ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి అధికారులతో కలిసి పాల్గొని అర్హులైన లబ్ధిదారుల వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ముస్కుల సహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ భరోసా పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణంలో పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీ లక్ష్మీదేవి, స్థానిక నాయకులు జానీ, పద్మ తదితరులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



మేడిపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం!

కమిటీ సభ్యుల సమావేశంలో దిశానిర్దేశం చేసిన డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి

బోడుప్పల్/ ప్రజా వాయిస్ :

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి పరిధిలో 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు, ప్రతి ఇంటికీ చేరవేసేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు పార్టీ బలోపేతం,భవిష్యత్ కార్యాచరణ పార్టీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యాసారం మహేష్,చెరుకు మహేష్ గౌడ్,యాసారం నగేష్,కాటపాక కుమార్, ప్రధాన కార్యదర్శులు ముదిగొండ రమేష్, సుదర్శన్ రెడ్డి,సుక్క జయేందర్,దేశగోని శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులు సింగం లక్ష్మణ్, బొల్గురి నాగరాజు, కార్యనిర్వాహక సభ్యులు వి.సతీష్, మహేశ్వరప్ప, శ్రీనివాస్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి పిలుపు

బెల్లంపల్లి / ప్రజా వాయిస్

నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమురాజుల శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం బెల్లంపల్లిలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలోని న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా చిలుముల శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కులవివక్ష లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.సమావేశంలో ఉప్పులేటి ప్రవంతి, చిలుముల స్వామి, బుడిమే విజయ్, ఇప్ప స్వామి, కల్లెపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు ఆదేశాలతో బాచుపల్లి కోమటికుంట చెరువు వద్ద క్షేత్రస్థాయి పరిశీలన

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని 8, 9వ ఆక్రమణలపై అధికారుల తనిఖీ..

పాత రికార్డుల పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకుంటామని వెల్లడి

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

బాచుపల్లి గౌరవ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పది రోజుల్లో పూర్తి స్థాయి డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉండటంతో బాచుపల్లి కోమటికుంట చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని 8, 9వ ఆక్రమణలపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో ఏడీ సర్వే శ్రీనివాస్, డీఐ చారి, ఇరిగేషన్ డీఈ నాయక్, ఏఈ రవి పాల్గొన్నారు. పిటిషనర్ ఆకుల సతీష్ సమక్షంలో చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టిన అధికారులు పూర్తిస్థాయి సర్వే నిర్వహించకుండానే వెనుదిరిగారు. ముందుగా ఉన్న పాత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పై అధికారులతో చర్చించిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హైకోర్టు నిర్దేశించిన గడువులో పూర్తి డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉన్న నేపథ్యంలో, అధికారులు ఎప్పుడు పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తారు? చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిం

అర్హులెవరూ మిగలొద్దు.. ఇందిరమ్మ బీమాపై ఎమ్మెల్యే పర్యవేక్షణ

కలెక్టర్‌తో కలిసి నమోదు కేంద్రాల తనిఖీ..

అర్హులందరికీ పథకం ప్రయోజనాలు అందించాలని ఆదేశం.

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్డీఓ రమణారెడ్డి

ప్రజా వాయిస్, మిర్యాలగూడ:

ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (దీూ=) సూచించారు. శుక్రవారం మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్‌తో కలిసి ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. తొలుత మాడుగులపల్లి మండలం కుక్కడం, గంద్రవాణిగూడెం



గ్రామాల్లోని నమోదు కేంద్రాలను పరిశీలించి నమోదు విధానం, ప్రజలకు అందుతున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దామరచర్ల మండల కేంద్రంలోని నమోదు కేంద్రాన్ని, మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలన్నీ ఈ పథకంలో నమోదు చేసుకోవాలని, ఒక్క అర్హుడు కూడా మిగిలిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, ఆర్డీఓ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా భారతదేశ ఓబీసీ ఉద్యమ పితామహుడు మాన్యవర్ త్యాగమూర్తి ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ 103వ జయంతి వేడుకలు

జాతీయ జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలి - డ్రాప్‌డౌన్ మెనూతో కులగణన చేపట్టాలి!

విద్యాసంస్థల్లో యూజీసీ ఈక్వాలిటీ నిబంధనలు తక్షణమే అమలు చేయాలి!

పూలే, సావిత్రిబాయి, అంబేద్కర్, మండల్ సరసన చందాపురి సాహెబ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాలి!

బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం డిమాండ్

ప్రజా వాయిస్,హైదరాబాద్

భారతదేశ ఓబీసీ ఉద్యమ పితామహుడు, బహుజన హక్కుల పోరాట యోధుడు, మాన్యవర్ త్యాగమూర్తి ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ 103వ జయంతి వేడుకలను బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, బీసీ చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగ అరుణ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం వెంకటేశ్వరరావు పాల్గొని మాన్యవర్ ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వెనుకబడిన తరగతుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం మాన్యవర్ ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేశారని పేర్కొన్నారు.1947 సెప్టెంబర్ 10న ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ నాయకత్వంలో బీహార్ ప్రాంతీయ పిచ్చడీ జాతి సంఘ్ స్థాపించబడిందని, ఆ సంస్థ తరువాత అఖిల భారత పిచ్చడా వర్గ్ సంఘ్‌గా విస్తరించి దేశవ్యాప్తంగా వెనుకబడిన తరగతుల ఐక్యతకు వేదికగా నిలిచిందని గుర్తుచేశారు.ఓబీసీ సమాజాన్ని కేవలం కులాల సమూహంగా కాకుండా సామాజిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనానికి గురైన విస్తృత వర్గంగా గుర్తించి, వారిలో సంఘటిత శక్తి, ఆత్మగౌరవం, రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు ఆయన కృషి చేశారని కొనియాడారు.1948 మార్చి 18న అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ని కలిసి రాజ్యాంగంలో ఆర్టికల్ 340 చేర్చాలని విజ్ఞప్తి చేసినట్లు చారిత్రక కథనాలు



పేర్కొంటున్నాయని గుర్తుచేశారు. ఆర్టికల్ 340 ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కమిషన్లు ఏర్పాటు చేయడం, వారి అభ్యున్నతికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం సాధ్యమైందని వివరించారు.బహుజన సమాజానికి కేవలం ఓటు హక్కు మాత్రమే కాకుండా చట్టసభల్లో ప్రాతినిధ్యం, నిర్ణయాధికారం ఉండాలని చందాపురి సాహెబ్ ఆకాంక్షించారని నాయకులు తెలిపారు.ఓబీసీలు కేవలం ఓటు బ్యాంకుగా మిగిలిపోకుండా పాలనలో భాగస్వాములు కావాలని, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం హక్కులు సాధించాలని ఆయన ఆశించారని గుర్తుచేశారు.ఓబీసీ హక్కుల కోసం ఉద్యమిస్తున్న క్రమంలో అనేక దాడులు, తీవ్ర ప్రతిబంధకాలు ఎదుర్కొన్నప్పటికీ తన పోరాటాన్ని కొనసాగించిన మహనీయుడని కొనియాడారు.ఫూలే – సావిత్రిబాయి – అంబేద్కర్ – మండల్ సరసన చందాపురి సాహెబ్‌కు జాతీయ గుర్తింపు కల్పించాలి! భారతదేశ సామాజిక న్యాయ చరిత్రలో మహాత్మా జ్యోతిరావు ఫూలే, క్రాంతిజ్యోతి సావిత్రిబాయి ఫూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సామాజిక న్యాయ యోధుడు బి.పి. మండల్ వంటి మహనీయుల సరసన మాన్యవర్ త్యాగమూర్తి ఆర్.ఎల్. చందాపురి సాహెబ్‌కు కూడా బహుజన సమాజం సముచితమైన జాతీయ గుర్తింపు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.

జాతీయ జనగణనలో ఓబీసీ ప్రత్యేక కాలమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి!

నేటికీ ఓబీసీ సమాజానికి సంబంధించిన ఖచ్చితమైన కులాల వారీ జనాభా గణాంకాలు అందుబాటులో లేకపోవడం వల్ల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం సాధించలేకపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.రాబోయే జాతీయ జనగణనలో ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కులాల వారీగా ఖచ్చితమైన జనాభా వివరాలు నమోదు చేసేందుకు:

1. జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలి.
2. డ్రాప్‌డౌన్ మెనూలో రాష్ట్రాల వారీగా గుర్తింపు పొందిన కులాల జాబితా ఉండాలి.
3. ప్రతి కులానికి ప్రత్యేకమైన కోడ్ కేటాయించాలి.
4. కులాల వారీగా జనాభా వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలి.
5. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి.

ఓబీసీ కులగణన అనేది దయాదాక్షిణ్యాలతో ఇచ్చే హక్కు కాదు. అది బహుజన సమాజం యొక్క రాజ్యాంగబద్ధమైన హక్కు, సామాజిక న్యాయం సాధనకు పునాది.

విద్యాసంస్థల్లో యూజీసీ ఈక్వాలిటీ నిబంధనలు వెంటనే అమలు చేయాలి!

దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలని నాయకులు డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థులకు సమాన అవకాశాలు, ఆత్మగౌరవం, విద్యా భద్రత, న్యాయం కల్పించేందుకు యూజీసీ ఈక్వాలిటీ నిబంధనలను తక్షణమే అమలు చేయాలని కోరారు.

విద్యాసంస్థల్లో వివక్షకు వ్యతిరేకంగా సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులు అందాలని పేర్కొన్నారు.

బహుజన విద్యార్థులు సంఘటితమై ఉద్యమించాలి!

మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, ఛత్రపతి సాహు మహారాజ్, పెరియార్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బి.పి. మండల్, మాన్యవర్ ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ వంటి మహనీయుల ఆశయాలను నేటి యువత కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు ఐక్యంగా నిలబడి విద్య, ఉద్యోగాలు, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాంగ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని కోరారు. చందాపురి సాహెబ్ జీవితం ఒక వ్యక్తి చరిత్ర మాత్రమే కాదు. అది భారతదేశ ఓబీసీ ఉద్యమ చరిత్ర. ఆయన చేసిన త్యాగాలు, నిర్మించిన సంస్థలు, ప్రారంభించిన పత్రికలు, సాగించిన రాజ్యాంగ పోరాటం, బహుజన సమాజానికి అందించిన చైతన్యం భావితరాలకు మార్గదర్శకం. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక మహిళా కార్యదర్శి రేణుకా దీదీ,బహుజన రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షులు రమావత్ లాలూ నాయక్ , హైకోర్టు అడ్వకేట్ బాలాజీ నాయక్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు ప్రశాంత్ గౌడ్, అంజన్, శరత్ నాయక్ తదితర విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.



కార్మికుల పట్ల చిన్నచూపా..?

కార్మికులకు ప్రతినెల 7వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలి..

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి..

సీఐటీయూ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ కు కార్మికుల వినతి..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెలా ఏడో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అదేవిధంగా కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, హాస్పిటల్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షుడు ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ మల్లికార్జున్ స్వామికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్.మహిపాల్ మాట్లాడుతూ కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తూ ప్రతినెలా వేతనాలు 20 తర్వాతనే ఇస్తూ ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని, ప్రతినెల ఏడో తేదీలోపు వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రతినెలా వేతనాలు సరైన సమయానికి రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అంతేకాకుండా డ్యూటీకి వచ్చేందుకు వెళ్లేందుకు కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జహీరాబాద్ హాస్పిటల్ కమిటీ అధ్యక్షుడు బండి సుధాకర్, నాయకులు వసీం, పవన్, కృష్ణ, రాణి, పుష్పము, మారతమ్మ, తదితరులు పాల్గొన్నారు..



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్..

ఆయా వార్డుల్లో లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల అందజేత..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని పలు ఆయా వార్డులలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం నాడు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ సరుకులు పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ ఖాజామియా, కాంగ్రెస్ నాయకులు జాఫర్, మాధవరెడ్డి, సురేష్ స్వామి, నర్సింహ యాదవ్, నగేష్, రమేష్ యాదవ్, పాండు,రాజు మరియు వార్డు ప్రజలు, లబ్ధిదారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..



సోషల్ మీడియా కన్వీనర్‌గా నజీర్ నియామకం

ప్రజా వాయిస్,అనంతగిరి:

తెలంగాణ రాష్ట్ర తురక కాశ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా పాలవరం ఆవాస గ్రామమైన రంగయ్య గుండె గ్రామానికి చెందిన సయ్యద్ నజీర్ శనివారం నియమితులయ్యారు.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కే బడే సాహెబ్ నియామక పత్రాన్ని అందజేసారు. సంఘం కార్యక్రమాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి, సంఘాన్ని మరింత బలోపేతం చేసే బాధ్యతను ఆయనకు అప్పగించారు.ఈ సందర్భంగా సయ్యద్ నజీర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తురక కాశ సంఘం అభివృద్ధి కోసం, సభ్యుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఆయన నియామకం పట్ల సంఘం నాయకులు, సభ్యులు, గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం..

పేరూరులో లబ్ధిదారులకు చేయూత పింఛన్ ధ్రువపత్రాల పంపిణీ....

20 మంది లబ్ధిదారులకు ప్రొసీడ్ ఫామ్స్ అందజేత...

గ్రామ శాఖ అధ్యక్షుడు చేతుల మీదుగా పింఛన్ పత్రాల అందజేత....

ప్రజా వాయిస్: అనుముల

నల్లగొండ జిల్లా అనుముల మండలం పేరూరు గ్రామంలో చేయూత పింఛన్ లబ్ధిదారులకు గ్రామ శాఖ అధ్యక్షుడు జానపాటి రామలింగయ్య చేతుల మీదుగా పింఛన్ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.పింఛన్ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.చేయూత పెన్షన్ లభిదారులకు మొత్తం 20 మంది లబ్దిదారులకు ప్రొసీడ్ ఫామ్స్ పంపిణి చేయడం జరిగిది, ఈ కార్యక్రమాలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జానపాటి రామలింగయ్య సెక్ట్రటరీ రాము, గ్రామ పెద్దలు షేక్ జానీ పాష, కొండూరు శోభన్ బాబు, షేక్ గౌస్ బాబా, షేక్ అజ్గర్, షేక్ గని, షేక్ జానీ, షేక్ అబ్దుల్, షేక్ హాము, తోట శ్రీధర్, గంటకంపు రాజు, బుయ్య శీను యడవెల్లి శంకర్ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.....



గిరిజన మోర్చా కొత్తగూడ మండల కమిటీ ఎన్నిక

మండలఅధ్యక్షునిగా బూర్క సారంగపాణి నియామకం

ప్రజా వాయిస్ కొత్తగూడ

స్థానిక కొత్తగూడ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు యాదగిరి మురళి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా ఎస్టీ మోర్చా ములుగు జిల్లా అధ్యక్షులు సిద్ధబోయిన సురేందర్ మరియు ఎస్టి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల బాబురావు హాజరయ్యారు ఈ సందర్భంగా గిరిజన మోర్చా కొత్తగూడ మండల కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.గిరిజన మోర్చా మండల అధ్యక్షునిగా బూర్క సారంగపాణి, ఉపాధ్యక్షుడిగా సిద్ధ బోయిన ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా వాసం యాకాబ్రం, కోశాధికారిగా ఈక వీరస్వామి లను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ వాసం సారయ్య, జిల్లా నాయకులు వాసం మునీందర్, మండల ప్రధాన కార్యదర్శి వజ్జ రవి, మండల ఉపాధ్యక్షుడు కొట్టే శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంగాపురం బిక్షపతి , భానోత్ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.



బండారి లేఔట్ లో ఘనంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవం

అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా భరోసా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బండారి లేఔట్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బండారి లేఔట్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు.డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసు వరగాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఇలాంటి పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమార్ యాదవ్, రామచంద్ర నాయక్, కృష్ణ, లక్ష్మారెడ్డి, దీపక్, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, వెంకట్, అనిల్, నయాబ్, రామనాయుడు, సంధ్య, సత్యవతితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.



రూ.1.25 కోట్లతో శ్రీరాంనగర్, ఎన్టీఆర్ నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం నిర్లక్ష్యం..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

గాజులరామారం సర్కిల్ పరిధిలోని రోడ్ మేస్త్రీ నగర్ డివిజన్‌లో శ్రీరాంనగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీలలో రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎమ్మెల్యే హయాంలో నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల, రెసిడెన్షియల్ పాఠశాల, ఆసుపత్రి వంటి కీలక సంస్థలను తీసుకువచ్చానని తెలిపారు. అయితే బీఆర్ఎస్ పాలనలో ప్రస్తుత ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా అవి పక్క నియోజకవర్గాలకు తరలిపోయాయని విమర్శించారు. తన హయాంలో సుమారు 40 వేల మందికి పెన్షన్లు మంజూరు చేయించానని, ఆ తర్వాత 15 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఒక్క పెన్షన్ కూడా మంజూరు చేయించలేదని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కుత్బుల్లాపూర్‌లో 6,600 చేయూత పెన్షన్లు అందిస్తోందని, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.గాజులరామారం సర్వే నంబర్ 307లోని ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ నాయకులు విక్రయించి నిరుపేదలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రిని విమర్శించే నైతిక హక్కు ప్రస్తుత ఎమ్మెల్యేకు లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్, డీసీసీ కార్యదర్శులు బుచ్చిరెడ్డి, జిమ్మి దేవేందర్, కాంగ్రెస్ నాయకులు పున్నారెడ్డి, రషీద్, ఐలయ్య, సలీం, బలరాం, రఘు, రజాక్, కాలనీ వాసులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అతివేగం.. అజాగ్రత్త.. రైతు ప్రాణం బలి

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి

(ప్రజా వాయిస్ షాబాద్)



రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుర్వగూడ గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం.. షాబాద్ మండలం కాక్లూర్ గ్రామానికి చెందిన తట్టెపల్లి జంగయ్య (55) ఉదయం సుమారు 8:36 గంటలకు తన పొలాల వద్దకు వెళ్లేందుకు ూూ 22 ూాణ 1770 నంబరు గల స్ప్లెండర్ మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కుర్వగూడ గేట్ వద్ద రోడ్డు దాటి కుర్వగూడ గ్రామం వైపు వెళ్తుండగా, ూా 07 ఖజ 9714 నంబరు గల కారు వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆయన బైక్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో జంగయ్య తలకు తీవ్ర గాయాలతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటనపై షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.



నాగసానిపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పరిశీలన

శ్రీరంగాపూర్ నవంబర్ 21 ప్రజా వాయిస్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి గ్రామంలో ఎంపీడీవో చెన్నయ్య, ఎంపీవో రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో బీమా పథకం అమలు తీరు, లబ్ధిదారుల నమోదు వివరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకం ప్రయోజనం అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పేద కుటుంబాలకు 'ఇందిరమ్మ బీమా' కొండంత భరోసా.. హంపోలి (కే) లో దరఖాస్తుల స్వీకరణ

పంచాయతీ కార్యాలయంలో పథకంపై అవగాహన,

అర్హుల నుంచి దరఖాస్తుల నమోదు

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరాలన్నదే లక్ష్యం:

సర్పంచ్ బండారి పోసాని బాయి

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకంపై శనివారం హంపోలి (కే) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా రక్షణ ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశాలు, కుటుంబ పెద్దకు అనుకోని ఆపద సంభవించినప్పుడు అందే ఆర్థిక ప్రయోజనాల గురించి క్షుణ్ణంగా వివరించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలోనే ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు.పాలకవర్గం కృషితో అర్హులకు న్యాయం ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండారి పోసాని బాయి మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.గ్రామ ప్రజలందరూ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు బీమా రక్షణ కల్పించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కదం గిరినాథ్, వార్డు సభ్యులు యోగేష్, సాయి కుమార్, అనిల్, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి కె. ప్రవీణ్, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో నైపుణ్యాన్ని పెంపొందించుకొవాలి

జ్ఞానాన్ని సంపాదించుకోడం ద్వారా మంచి భవిష్యత్తును పెంపొందిచుకోవచ్చు

మండల విద్యాశాఖ అధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ

ప్రజా వాయిస్ కొత్తగూడ

ఎంపియుపిఎస్ కొత్తగూడ పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ కన్వీనర్ నెల్లుట్ల .భాస్కర్ ఆధ్వర్యంలో ఇంగ్లీషు ఒలంపియాడ్ మరియు వకృత్వ మండల స్థాయి పోటీలు జరిగినాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గుమ్మడిలక్ష్మీనారాయణ పాల్గొని ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించినారు .అనంతరం ఇంగ్లీష్ ఒలంపియాడ్ ప్రథమ బహుమతిని గోగు.హర్షిత్ జడ్.పి.హెచ్.ఎస్. పొగుళ్లపల్లి రెండవ బహుమతిని ఏ .అనిత కేజీబీ కొత్తగూడ, జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని ఈ. వర్షిత్ జెడ్ పి హెచ్ ఎస్. బత్తులపల్లి ,రెండవ బహుమతిని జి .సుమశ్రీ ఎంపియుపిఎస్ కొత్తగూడ మరియు సీనియర్ విభాగంలో సిహెచ్. శరణ్య కేజీబీ కొత్తగూడ, రెండవ బహుమతిని కోమ్మనబోయిన .జయశంకర్ జడ్పిహెచ్ఎస్ . పొగుళ్లపల్లి జూనియర్స్ విభాగంలో హెచ్. తనుజ ఎంపియుపిఎస్. కొత్తగూడ విద్యార్థులు గెలుచుకున్నారు. వారికి మండల విద్యాధికారి బహుమతులను సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంగ్లీష్ భాషలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని జ్ఞానాన్ని సంపాదించడం ద్వారా మంచి భవిష్యత్తును పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ కన్వీనర్ నెల్లుట్ల .భాస్కర్, ఎంపీ యుపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుమ్మడి లలిత, వివిధ పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు మండల .రాజ్ కుమార్, బి .కిషన్, ఎన్. కృష్ణమోహన్, వాసం .ప్రభాకర్ కల్తీ .కవిత, సి అర్ పి కే .అశోక్ మరియు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.